


ఈ లేఅవుట్ ఆర్ఆర్ డెవలపర్స్‌కు సంబంధించినది..

- రుద్ర ప్రాజెక్టులపై సమగ్ర విచారణకు ఆకుల సతీష్ ఫిర్యాదు..!
- 'ప్రభుత్వ, మున్సిపల్, చెరువు' భూముల వినియోగంపై ఆరోపణలు..
- కొనుగోలుదారులు నష్టపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి:ఆకుల సతీష్..!
- ఎమినిటీస్ భూములు వినియోగం- నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలు..!
- ప్రాజెక్ట్‌ల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ.. నిర్మాణాల్లో సెట్‌బ్యాకులు కబ్జా..
- నిర్మాణం ఏదైనా అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా 'రుద్ర కన్‌స్ట్రక్షన్'..!
- ఆర్ఆర్ డెవలపర్లు మున్సిపల్‌కు రాసిచ్చిన ప్రజాప్రయోజనాల స్థలంలో..
- రుద్ర కన్‌స్ట్రక్షన్‌కు అప్రోచ్ రోడ్డుగా కమాన్ నిర్మాణం..!
- గంగాదేవుని చెరువులోకి మురుగునీరు మళ్లింపుపై ఆరోపణలు..
- అనుమతులు, స్కెచ్ ప్లాన్‌లపై క్షేత్రస్థాయి తనిఖీలు ఏవీ..?
- ఐదు శాఖలతో సంయుక్త సర్వేకు సతీష్ డిమాండ్..!

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# 'రుద్ర కన్‌స్ట్రక్షన్'కు...

# అవినీతి అధికారులే బలమా..?

హెచ్ఎండిఏ అనుమతులు పొందిన ప్రాజెక్ట్‌లు అంటేనే..! అక్రమాలకు నిలయంగా, మారుతున్నాయి.. చెరువులు, ప్రభుత్వ భూములు, మున్సిపల్‌కు గిఫ్ట్ డీడ్ చేసిన భూములు కబ్జాలు చేసుకునే వెసులుబాటు కల్పించే, ప్రత్యేక విభాగంగా హెచ్ఎండిఏపై విమర్శలు వస్తున్నాయి.. అక్రమ వెంచర్‌లకు, హెచ్ఎండిఏ ప్రాణం పోసే శాఖగా పేరొందుతోంది.. హెచ్ఎండిఏ నుండి అనుమతులు పొందిన భారీ భవన నిర్మాణాలు సైతం నిబంధనలు ఉల్లంఘించినా, చర్యలు ఉండవు.. అలాంటి నిర్మాణ సంస్థల్లో ఒకటి 'రుద్ర కన్‌స్ట్రక్షన్' పేరు ఇప్పుడు ప్రధానంగా మారుమోగుతోంది.. నిజాంపేట్‌లో హైవే ఆక్రమణతో పాటు, భవనం చుట్టూ ఉన్న 6 మీటర్ల సెట్‌బ్యాకులు ఆక్రమించిన రుద్ర నిర్మాణ సంస్థ పనులు, కరప్షన్ అధికారుల నీడలో కొనసాగుతుండగా..! ఇప్పుడు దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో పలుచోట్ల అదే ఆక్రమణల పర్వం సాగుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.. పక్కవెంచర్‌కు సంబంధించిన ప్రజాప్రయోజనాలను, రుద్ర నిర్మాణ సంస్థ ఏకంగా అప్రోచ్ రోడ్డుకు వినియోగిస్తుంటే..! లంచావతారుల నిఘా వైఫల్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. దీనిపై ఓ సామాజిక వేత్త సమగ్ర విచారణకు డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 12:



దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు..


ఆర్ఆర్ డెవలపర్స్ ప్రజా ప్రయోజనాలు ఆక్రమించి రుద్ర రాయల్ విలేజ్-2 కమాన్..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హైడ్రాపై హైకోర్టు సీరియస్..

### సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు!



**హైదరాబాద్ పెన్ పవర్:** రెవెన్యూ అధికారుల ఆదేశాలు లేకుండానే ఇష్టారాజ్యంగా కూల్చివేత లకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, కనీస సమాచారం లేకుండా ప్రహరీ గోడలు కూల్చివేయడాన్ని తీవ్రంగా పరిగణించిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం.. హైడ్రాపై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. మల్కాజిగిరి మండల పరిధిలోని వాణి కో ఆపరేటివ్ సొసైటీలో తమ స్థలాల జోలికి రావొద్దని గతంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నా, హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను బుధవారం న్యాయస్థానం విచారించింది. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి తిరుమలగిరి తహసీల్దార్లు సంచలన విషయాలను వెల్లడించారు. పిటిషనర్ల ఆస్తులను కూల్చాలని గానీ, అక్కడ ఫెన్సింగ్ వేయాలని గానీ తాము హైడ్రాకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వారు ధర్మాసనానికి స్పష్టం చేశారు. కేవలం రక్షణ శాఖ భూములను కాపాడాలని తాము కోరిన మాట వాస్తవమే అయినా, పిటిషనర్ల ప్రహరీ గోడల కూల్చివేతతో తమకు సంబంధం లేదని చెప్పారు.

**ధిక్కరణ కిందకే వస్తుంది..!**

దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. రెవెన్యూ అధికారుల నుంచి కనీస అనుమతులు లేకుండా, రికార్డులను పరిశీలించకుండా హైడ్రా సొంత నిర్ణయాలతో ఎలా కూల్చివేతలు చేపడుతుందని

-4 లో

## ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు భారత్ ఎంతో ప్రగతి సాధించిందని, ముఖ్యంగా డిజిటల్ ఇండియా, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల సాధనలో దేశం మైలురాళ్లను అధిగమించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు గుర్తుచేశారు. ఎస్వీపీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఫండ్ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్, శాస్త్రీయ ఆవిష్కరణల రంగానికి కూడా తగిన ఆర్థిక

-4 లో

# 'రుద్ర కన్‌స్ట్రక్షన్'కు.. అవినీతి అధికారులే బలమా..?


చెరువులోకి మళ్లించిన డ్రైనేజీ పైప్‌లైన్..




## ప్రజాప్రయోజనం కోసం 9,404.47 గజాల భూమి గిఫ్ట్ డీడ్..

దుండిగల్‌లో ఆర్.ఆర్. డెవలపర్స్ గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్.. ఓపెన్ స్పేస్‌ను ప్రజా అవసరాలకు కేటాయించిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుండిగల్ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో ఉన్న ఓపెన్ స్పేస్‌ను ప్రజా ప్రయోజనాల కోసం గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ ద్వారా కేటాయించినట్లు పత్రంలో పేర్కొన్నారు.. ఈ డీడ్‌ను 2022 నవంబర్ 29న అమలు చేసినట్లు డాక్యుమెంట్ ద్వారా స్పష్టమవుతోంది.. గిఫ్ట్ డీడ్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్-గండిమైసమ్మ మండలం, సర్వే నెంబర్లు 615(P), 616, 617, 618, 619(P), 620(P), 621(P)లోని మొత్తం 9,404.47 చదరపు గజాలు (7,862.13 చదరపు మీటర్లు) విస్తీర్ణం ఉన్న ఓపెన్ స్పేస్‌ను ప్రజా ప్రయోజనం కోసం గిఫ్ట్‌గా ఇచ్చినట్లు పేర్కొన్నారు..

## రుద్ర రాయల్ విలేజ్-2పై కబ్జా ఆరోపణలు..

దొమ్మర పోచంపల్లిలోని రుద్ర రాయల్ విలేజ్-2కు సంబంధించి, సర్వే నెంబర్లు 294/P, 295/P, 296/P, 620P లోని ప్రాజెక్టు, అప్రోచ్ రోడ్డు, ఎంట్రన్స్ గేట్/ఆర్చ్‌లు మున్సిపాలిటీకి గిఫ్ట్‌గా చేసిన ఎమినిటీస్ భూముల పరిధిలో ఉన్నాయా లేదా అన్నది అధికారులు క్షేత్రస్థాయిలో భౌతిక సర్వే నిర్వహించి తేల్చాలని సతీష్ కోరారు.. అదేవిధంగా సర్వే నెంబర్లు 615 నుంచి 621 వరకు ఉన్న ఎమినిటీస్ భూములకు సంబంధించి, గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం. .3200/2022-ఎస్‌ఆర్‌ఓ:1521 ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ భూమిని ఆక్రమించి దానిని అప్రోచ్ రోడ్డుగా చూపించి అనుమతులు పొందారా..? అక్రమంగా ఆర్చ్ నిర్మించారా..? అనే అంశాలను కూడా పరిశీలించాలని కోరారు.. ఇదే క్రమంలో సర్వే నంబర్ 291లోని ప్రభుత్వ భూమి, చెరువు శిఖం భూముల వర్గీకరణ, హద్దులు, ప్రస్తుత వినియోగంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.. గంగాదేవుని చెరువులోకి డ్రైనేజీ, మురుగునీటిని మళ్లిస్తున్నారనే ఆరోపణలపైనా సమగ్ర సాంకేతిక విచారణ జరపాలని సతీష్ కోరారు. ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్, పరిధి, నీటి ప్రవాహపు మార్గాలు, డ్రైనేజీ మళ్లింపు అంశాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు..

**ఆరోపణలు వాస్తవమా..? కాదా..? అనేది అధికారుల సమగ్ర విచారణలో తేలాలి. అయితే విచారణ పూర్తయ్యే వరకు వివాదాస్పదంగా ఉన్న భూముల్లో మరిన్ని నిర్మాణాలు జరగకుండా అధికారులు తక్షణ నివారణ చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో విల్లాలు కొనుగోలు చేసే ప్రజలు నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టకపోతే కొనుగోలు దారులు మోసపోయే ప్రమాదం ఉందని సతీష్ దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్‌తో ప్రస్తావించారు.. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు..**

- 3 పేజి తరువాయి

జీహెచ్ఎంసిలో ఉన్నప్పుడు కొంచెం భయం భక్తితో విధులు నిర్వర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికార యంత్రాంగం.. ప్రస్తుత సిఎంసి విభజన అనంతరం బరితెగించి వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. గండిమైసమ్మ-దుండిగల్ మండలం పరిధిలోని దొమ్మర పోచంపల్లి, బౌరంపేట ప్రాంతాల్లో రుద్ర కన్‌స్ట్రక్షన్, రుద్ర అశోక, జేఎన్‌ఎస్ కన్‌స్ట్రక్షన్ పేర్లతో కొనసాగుతున్న ప్రాజెక్టులపై సమగ్ర విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. ఆయా ప్రాజెక్టుల్లో ప్రభుత్వ భూములు, మున్సిపల్‌కు చెందిన ప్రజాప్రయోజనాలకు చెందిన భూములు, చెరువు శిఖం భూముల వినియోగం, నిర్మాణ అనుమతుల్లో అవకతవకలు, అప్రోచ్ రోడ్లు, డ్రైనేజీ నీటిని, అక్రమంగా చెరువుల్లోకి మళ్లింపు తదితర అంశాలపై పూర్తి ఆధారాలతో దుండిగల్ తహసీల్దార్, సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు..

## బౌరంపేటలోనూ సమగ్ర విచారణకు డిమాండ్..

బౌరంపేటలోని సర్వే నెంబర్లు 146, 147లో రుద్ర/జెఎన్‌ఎస్/అశోక కన్‌స్ట్రక్షన్ పేర్లతో జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించి సర్వే నెంబర్ 166/1లోని ప్రభుత్వ భూమి వినియోగంపై కూడా విచారణ జరపాలని సతీష్ కోరారు.. ప్రభుత్వ భూమిని రోడ్లు, కాంపౌండ్ వాల్స్, షెడ్లు, విల్లా నిర్మాణాలకు వినియోగించారా..? నిర్మాణాలకు అవసరమైన మున్సిపల్, హెచ్ఎండిఏ, రేరా అనుమతులు ఉన్నాయా..? మంజూరైన ప్లాన్లకు అనుగుణంగానే నిర్మాణాలు జరుగుతున్నాయా..? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని అన్నారు.. రెండంతస్తుల నిర్మాణాలు అనుమతులు లేకుండా జరుగుతున్నాయనే ఆరోపణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో కూడా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.. ఐదు శాఖలతో ఉమ్మడి సర్వేకు సతీష్ డిమాండ్ చేశారు..





# ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానం

-3 పేజి తరువాయి

సహాయం అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిందని, సైన్స్ రంగానికి కేవలం ప్రభుత్వం నుంచే కాకుండా ప్రైవేట్ భాగస్వాముల నుంచి కూడా ఫండింగ్ పెరిగినప్పుడే నూతన ఆవిష్కరణలు, ఎంఎస్‌ఎంఈ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని రాంచందర్ రావు అన్నారు. ఇటీవల ప్రారంభించిన యూపీఐ విధానం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ లావాదేవీలలో ఒక్క భారతదేశానిదే 40 శాతం వాటా ఉండటం మన సాంకేతిక రంగానికి నిదర్శనమని చెప్పారు. ఇటువంటి తరుణంలో ఎస్వీపీ వంటి సంస్థలు ముందుకు వచ్చి నూతన ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఫండింగ్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఇది దేశానికి మరింత ఉజ్జ్వలమైన ఆర్థిక భవిష్యత్తును అందిస్తుందని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# హైడ్రాపై హైకోర్టు సీరియస్..

## సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు!

-3 పేజి తరువాయి

నిలదీశారు. 2022 నుంచి ఈ భూములు హైకోర్టు స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నాయని, వాటిని ఉల్లంఘించడం ధిక్కరణ కిందకే వస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇదే క్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కోర్టు దృష్టికి మరో ముఖ్యమైన విషయాన్ని తెచ్చారు. తన పరిధిలో ఇప్పటివరకు దాదాపు 30 నుంచి 40 కూల్చివేతలను హైడ్రా చేపట్టిందని, అయితే ఆయా పనులకు సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వెళ్లలేదని, అసలు తమకు సమాచారమే లేదని కలెక్టర్ వెల్లడించారు. అధికారుల మధ్య కనీస సమన్వయం లేకుండా, చట్టబద్ధత లేని ఇటువంటి కూల్చివేతలు ఏ ప్రాతిపదికన చేపడుతున్నారో వివరించాలని హైడ్రాను కోర్టు కోరింది. అనధికారికంగా చేపట్టిన ఆ 30-40 కూల్చివేతలపై పూర్తి నివేదికను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అంతేకాకుండా, హైడ్రా ఏర్పాటుకు ముందు భూవివాదాలకు సంబంధించి హైకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన స్టే ఉత్తర్వుల వివరాలేవీ హైడ్రాకు చేరడం లేదని న్యాయస్థానం గుర్తించింది. దీంతో భవిష్యత్తులో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కీలక ఆదేశాలు జారీ చేసింది.

**కూల్చివేతలకు అడ్డుకట్ట వేయాలి!**

హైడ్రా కార్యకలాపాలు సాగే అన్ని జిల్లాల కలెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని సూచించింది. తద్వారా చట్టవిరుద్ధమైన కూల్చివేతలకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేసింది. హైడ్రాపై నమోదు చేసిన కోర్టు ధిక్కరణ కేసులో రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ విచారణకు రెవెన్యూ అధికారులు మళ్లీ హాజరు కావాల్సిన అవసరం లేదని ధర్మాసనం మినహాయింపు ఇచ్చింది.

# అంతర్జాతీయ యువజన దినోత్సవం

**యువతీ యువకులందరికీ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యువతీ యువకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యువత ఆలోచనలకు ప్రోత్సాహం, వారి ప్రతిభకు వేదిక, వారి ప్రయత్నాలకు అవసరమైన వనరులను అందిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరు. పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంలోని అంతరాలు వంటి సవాళ్లను అధిగమించేందుకు యువతకు అవకాశాలు, వనరులు, నైపుణ్యాలు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. యువతకు సరైన విద్య, నైపుణ్యం, క్రీడలు, ఉపాధి, నాయకత్వ అవకాశాలు కల్పించినప్పుడే బంగారు భవిష్యత్తును నిర్మించగలం. ప్రజా ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తోంది. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. భవిష్యత్ సవాళ్లను అధిగమించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన ఏటీసీలు, స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటివి మంచి ఫలితాలు అందిస్తున్నాయి. టామ్‌కామ్ ద్వారా సింగపూర్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో అవకాశాలను దక్కించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాం. యువత వ్యసనాలకు బారిన పడకుండా మాదకద్రవ్యాల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. యువత స్పష్టమైన లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి. యువతే మన బలం -- యువతే మన భవిష్యత్తు. యువతకు శుభాభినందనలు" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 4వ సారి కూడా ఆడపిల్ల పుట్టిందని ఆత్మహత్య చేసుకున్న బాలింత

**నల్గొండ: పెన్ పవర్:** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదం మునుగోడు మండలం చీకటి మామిడి గ్రామానికి చెందిన బాలింత మమత ఆసుపత్రి ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. వారం రోజుల క్రితమే ఆమెకు ప్రసవం జరగగా వరుసగా మళ్ళీ ఆడపిల్లలు పుట్టడంతో కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని బంధువులు తెలిపారు. అత్తింటి వేధింపులే మమత మృతికి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐస్ క్రీమ్ గోదాం లో అగ్ని ప్రమాదం

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవరాయాంజాల్ స్నో రిచ్(ఐస క్రీమ్,చికెన్,చాకోలెట్స్)గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. గోదాంలో మంటలు ఒక్కసారిగాచెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు. దట్టమైన పొగలు అలుముకోవడంతో భయాందోళనలో పరిసర ప్రాంత ప్రజలు వుండిపోయారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సిన ఉంది.

## పోలీసులపై దౌర్జన్యం.. కత్తితో పొడుస్తానంటూ బెదిరింపులు... శ్రీకాళహస్తిలో కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై యువకులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన శ్రీకాళహస్తిలో ఉద్రిక్తతకు దారితీసింది. రైల్వే స్టేషన్‌లో జరిగిన సెల్‌ఫోన్ చోరీపై విచారణకు వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రమణయ్యకు మార్గమధ్యంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన కనిపించింది. క్షతగాత్రులను చూసిన రమణయ్య వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి గురైన వాహనాల తాళాలు తీసుకుని పోలీస్ స్టేషన్‌కు రావాలని యువకులకు సూచించగా.. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. మాటామాటా పెరగడంతో హెడ్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు "కత్తితో పొడుస్తానంటూ" బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయకనగర్ లో అప్పుల బాధ తాళలేక నరేష్, మేఘన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రుల మృతితో వారి ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మారగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు భర్త నరేష్ ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, భార్య మేఘన నిద్రమాత్రలు మింగి తాగి ఆత్మహత్య చేసుకుంది. మేఘన, నరేష్ కు 8 ఏళ్లు కొడుకు, 6 ఏళ్లు బాబు వున్నారు. ఇద్దరు పిల్లలను మేనత్త వద్ద వదిలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య కు పాల్పడ్డారు. పక్క ప్లానింగ్ తో చనిపోదాం అని భార్యాభర్తలు చేసుకున్నట్లు అనుమానం. బంధువులు అప్పుల బాధనే ఆత్మహత్యకు గల కారణాలు అంటున్నారు. భర్త నరేష్ కరెంట్ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహిస్తున్నాడు.

## అమెరికాలో హన్మకొండ జిల్లా విద్యార్థి మృతి 15 రోజులుగా మృత్యువుతో పోరాడి కన్నుమూత

**హన్మకొండ: పెన్ పవర్:** అమెరికాలోని ఫ్లోరిడాలో జూలై 25వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో 75% కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం గంటూర్పల్లికి చెందిన భరత్ చందర్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందాడు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులు ఉన్నత చదువుల కోసం కొడుకును 2023లో అమెరికా పంపారు. అమెరికా నుంచి తిరిగి వచ్చి వివాహం చేసుకుందాం అనుకునే సమయానికి అనుకోని ప్రమాదంలో మృతి చెందాడు. ఉన్నదంతా ఖర్చు చేసినా కొడుకును కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రుల ఆవేదన

## ఆయూష్ హౌస్ సర్జన్ల నిరసన నినాదాలు చేస్తున్న హౌస్ సర్జన్లు, వైద్య విద్యార్థులు

**హైదరాబాద్ పెన్ పవర్:** అల్లోపతి వైద్యసర్జన్లతో సమానంగా తమకు ప్రభుత్వం ఉపకార వేతనాన్ని పెంచాలని ఆయూష్ హౌస్ సర్జన్లు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆయూష్ హౌస్ సర్జన్లు, పీజీ స్కాలర్ల జేఏసీ పిలుపు మేరకు బల్కంపేటలోని కొణి జేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయంలో పని చేస్తున్న హౌస్ సర్జన్లు గత తొమ్మిది రోజులు నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వీరికి ప్రస్తుతం ప్రకృతి వైద్య అభ్యసి స్తున్న విద్యార్థులు మద్దతు పలికారు.
తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి తమకు ఉపకార వేత నాన్ని పెంచలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆయూష్ జూనియర్ వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపకార వేతనాన్ని పెంచే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## గూడూరు స్వామిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలి...




**హుజూరాబాద్: పెన్ పవర్:** జర్నలిస్టుల నివేశన స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరించుకోకుండా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జక్కని నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీందర్ లు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీ క్యాంప్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఉత్తర్వుల మేరకు మున్సిపల్ అధికారులు హౌస్ నంబర్లు కేటాయించగా, జర్నలిస్టులు లక్షలాది రూపాయలు వెచ్చించి గృహాలు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. అయితే, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు రాజేశ్వరి భర్త, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గూడూరు అంజలి మామ అయిన కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి అక్కసుతో కోర్టులో కేసు వేశారని మండిపడ్డారు. మూడేళ్లుగా ఆ కేసును ఉపసంహరించుకోకుండా జర్నలిస్టులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సమస్యపై రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబులకు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం లభించలేదని నిరసనకారులు వాపోయారు. కేసు విత్‌డ్రా చేయిస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు. గూడూరు స్వామిరెడ్డి తన నిరంకుశ వైఖరిని వీడి వెంటనే కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, దేవసాని ప్రియదర్శిని, సృజన, సందెల వెంకన్నలతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి లో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలి

**,గోదావరిఖని పెన్ పవర్:** పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. దీని ద్వారా యువతకు మంచి భవిష్యత్తుకు బాటలు పడటంతో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. క్లస్టర్ ఐటీఐ ద్వారా వివిధ పారిశ్రామిక రంగాలకు అవసమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు కూడా నైపుణ్యం కలిగిన స్థానిక యువత అందుబాటులోకి వస్తారు. అందువల్ల పెద్దపల్లి నియోజకవర్గం లో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత ఆకాంక్షిస్తున్నారు. పెద్ద పెల్లి ప్రాంతానికి ఈ యొక్క పరిశ్రమములను ను తీసుకురావడానికి కృషి చేస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మరియు పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి పెద్దపల్లి పార్లమెంటు ప్రజల తరపున పి.మల్లికార్జున్ శ్రమ శక్తి అవార్డు గ్రహీత, అనుమాస శ్రీనివాస్ జీన్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారికీ ధన్యవాదాలు తెలుపుతున్నాము

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:** వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులు జంతువులను వేటాడుతున్నారన్న సమాచరంతో వారిని పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి వెళ్ళిన నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. ఈ ఘటన పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నవీన్ ను వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్ళినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు డిఎఫ్ఓ మంత్రికి వివరించారు.
అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది పోషిస్తున్న పాత్ర అసమాన్యమైనదని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతున్నదని మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.
మృతిచెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం మృతుడు నవీన్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ వినయ్ కుమార్ ను ఆదేశించారు.

## సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో అరటి మొక్కలు నాటిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ నగరంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అరటి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని, చిన్నప్పటి నుంచే ప్రకృతిపట్ల ప్రేమ, చెట్ల పట్ల బాధ్యతాభావం అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని ఆయన అన్నారు.
పాఠశాలకు 200 అరటి మొక్కలను రంగు సంపత్ ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థులకు సువర్ణప్రాశన చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.
పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యా, ఆరోగ్య, పర్యావరణ కార్యక్రమాలను మేయర్ అభినందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్,బొడ్ల శ్రీనివాస్,మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, దేవసాని సరస్వతీ సత్యనారాయణ , పాఠశాల ప్రధానాచార్యులు మోర రణదీర్ , ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# పీ.ఆర్.సిని వెంటనే ప్రకటించాలి



తహసీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 12:** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు పాపావత్ యాదగిరి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటం కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం గార్ల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు పాపావత్ యాదగిరి నాయక్, మాట్లాడుతూ పీఆర్ సిని వెంటనే ప్రకటించాలని,

పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే కేజీబీవీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, ఎంఆర్సీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు దశలవారీగా పోరాట కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గార్ల మండల తహసీల్దార్ శారదకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ నాయకులు బాలాజీ నాయక్, మాచర్ల సుందర్ కుమార్, షరీఫ్, జబ్బ వీరస్వామి, కబ్బాకుల వెంకన్న ఉపాధ్యాయులు సంతు, రామనాధం, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, తోట రమేష్, బాల్య, కన్నయ్య, వెంకట్రావు, శ్రీను, అనిల్, కిరణ్, పార్వతి, విజయ, సీతారాములు, రవీందర్ ప్రసాద్, లోకేష్, భావ్‌సింగ్, రమేష్, మధు, లచ్చిరాం, ప్రసాద్, కిషన్, రవీందర్, శోభన్‌బాబు, వజ్రం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పట్ల అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్



అవగాహన సదస్సులో విద్యార్థులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 12:**
విద్యార్థులు, యువత రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి సూచించారు. గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించి, విద్యార్థులకు రోడ్డు భద్రతా నిబంధనలు, హెల్మెట్ ఆవశ్యకత, డ్రైవింగ్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజకుమారి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత మాత్రమే డ్రైవింగ్ చేయాలని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రహదారులపై వేగంగా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో విలువైన ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని తెలిపారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల గ్రంథపాలకులు లక్ష్మాలాల్‌ను అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల రవీందర్, అధ్యాపకులు, స్టూడెంట్ కౌన్సిలర్ అడపాల ప్రసాదరావు, డెమో ప్రెసిడెంట్ జోగ్య నాయక్, జి. సోమన్న, జి. రాంబాబు, జి. సుజాత, రమణతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే లక్ష్యంగా ఆధునిక పరికరాలు



నూతన సామాగ్రిని ప్రారంభిస్తున్న సర్పంచ్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 12:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గార్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ, పచ్చదనం పరిరక్షణకు అవసరమైన నూతన అత్యాధునిక పరికరాలను పంచాయతీ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. పంచాయతీ ఆవరణలో బుధవారం నూతన పరికరాలను సర్పంచ్ పార్వతి హతిరాం నాయక్ ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేసేందుకు రెండు ఫాగింగ్ మిషన్లు, రెండు తైవాన్ పవర్ స్ప్రేర్ పంపులు, రెండు గ్రాస్ కటింగ్ మిషన్లు, 16 డస్ట్‌బిన్లు, రెండు గార్డెన్ కత్తెరలు, రెండు కొమ్మలు కటింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటితోపాటు వీధిలైట్లు, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాట్లు కూడా చేపట్టారు.నూతన పరికరాల ద్వారా దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు గ్రామంలోని పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని సర్పంచ్ పార్వతి హతిరాం నాయక్ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు కూడా పంచాయతీకి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండీ జరీనా బేగం, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్, ఎండీ రహీం ఖాన్, పంచాయతీ సిబ్బంది సుధాకర్, సైజాద్, శ్రీనివాసరావు, దాసు, వెంకన్న, బాబు,

# ఉచిత హెచ్ పీవీ వ్యాక్సినేషన్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 12:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లోని విద్యార్థినులకు ఉచిత హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించి వ్యక్తిగత పరిశు భ్రత వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పై విద్యార్థినులకు అవగాహన కల్పించి టీకాలు అందజేశారు అనంతరం ఈ సందర్భంగా పీ హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. బి. హనుమంతరావు మాట్లాడుతూ.పాఠశాలలో 14 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలకు హెచ్ పీవీ టీకాలు వేసినట్లు తెలిపారు. టీకా పంపిణీకి ముందే వ్యాక్సిన్ భద్రత, దాని ప్రాముఖ్యత, క్యాన్సర్ నివారణలో టీకా పాత్రపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలు ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది హెచ్ ఈ ఓ లోక్యానాయక్ ఎం ఎల్ హెచ్ పి ఎస్ సుమతి నందిని ఏఎన్ఎం లు పార్వతీ రమాదేవి ఆశా కార్యకర్త విజయ తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సిన్ అందిస్తున్న వైద్య సిబ్బంది

## ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి



**హైదరాబాద్, ఆగస్టు 12 పెన్ పవర్:**
తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

## సెంట్రల్ యూనివర్సిటీలో ఈగల్ టీం దాడులు

## 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో తెలంగాణ ఈగల్ (జూా+ాజు) టీమ్ మరియు సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసారు. యూనివర్సిటీ పరిధిలో డ్రగ్స్ విక్రయాలు, వాడకం జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో ఈగల్ టీమ్ తనిఖీలు చేపట్టింది. 17 మందికి పాజిటివ్ అనుమానం ఉన్న విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ప్రధాన నిందితుడి అరెస్ట్ విద్యార్థులకు అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు అస్సాం రాష్ట్రం నుండి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది క్యాంపస్లో ఒక్కో గ్రాము గంజాయిని సుమారు 500 రూపాయ లకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు, నిందితుల సమాచారం పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా వెలువడాల్సి ఉంది.

## పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ రాయదుర్గంలో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ ప్రాజెక్టు టెండర్లలో భారీ కుంభకోణం మరియు ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ టెండర్లను రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు....ఈ రోజు రాయదుర్గం భూముల వద్ద ఆందోళన చేపట్టిన దాసోజు శ్రవణ్, శంబిపూర్ రాజు.. బీఆర్ఎస్ శ్రేణులు..రాయదుర్గంలోని అత్యంత విలువైన 6.30 ఎకరాల ప్రభుత్వ భూమి లో మొత్తం సుమారు 27 లక్షల చదరపు అడుగులు నిర్మాణం జరుపుటకు నిర్ణయం.. అంచనా వ్యయం: భూమి విలువ కాకుండా దాదాపు రూ. 2,059.81 కోట్లు.కేంద్ర సహాయం: కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ. 202 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది...

**బీఆర్ఎస్ ప్రధాన అభ్యంతరాలు ఁ ఆరోపణలు**

ఈ ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే బిల్ట్-అప్ ఏరియా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేట్ డెవలపర్‌కు ఏకంగా 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని (ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు) కేటాయించడంపై బీఆర్ ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు...

పీపీపీ (్ౖరౌ) మోడల్‌లో టెండర్ నిబంధనలను ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మార్చేసిందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో లీజు ప్రాతిపదికన ఇస్తుంటే, ఇక్కడ ఏకంగా అమ్ముకునే వెసులుబాటు ఇచ్చారని విమర్శించారు...

కేంద్ర నిధుల దారి మళ్లింపు: కేంద్రం ఇచ్చే రూ. 200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ం+ూజ) ద్వారా నేరుగా ప్రైవేట్ డెవలపర్‌కు బదిలీ చేసేందుకు నిబంధనలు రూపొందించారని, ఇది కేంద్ర పథక నియమాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగం: ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ, సర్వేలు, మరియు అనుమతుల పేరుతో ఇప్పటికే చేసిన ఖర్చులను కేంద్ర నిధుల నుండి సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించడాన్ని తప్పుబట్టారు..

**ల్యాండ్ ఇష్యూ (భూ వివాదం ఁ కూల్చివేతలు)**

ఈ యూనిటీ మాల్ నిర్మాణ స్థలానికి సంబంధించి గతంలో (2024 ఆగస్టులో) పెద్ద వివాదం నడిచింది. మాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఉన్న కొన్ని నిర్మాణాలను అక్రమ కట్టడాలంటూ అధికారులు జీహెచ్ఎంసీ సాయంతో కూల్చివేశారు. అయితే, ఈ భూమి తమ సొంత పట్టా భూమి అని, ఇన్యామ్ రద్దు చట్టం కింద దీనిపై స్పష్టత లేదని 'హైదరాబాద్ టానరీస్' అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేశారని బాధితులు ఆందోళన చేశారు...

**బీఆర్ఎస్ డిమాండ్లు:**

కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో, ఈ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కాగ్ (జూా+) లేదా ఇతర స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించే వరకు కేంద్ర నిధుల విడుదలను నిలిపివేయాలని కోరారు

# ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్బీ నగర్ ఏపీసీ కార్యాలయంలో ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఘటన చోటు చేసుకుంది. మృతుడు ఎల్బీనగర్ పీఎస్కు చెందినన్రాజ జీ. సాయికుమార్ (13128). ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్రూమ్లో ఉరివేసుకున్నట్లు గుర్తించారు. సాయికుమార్ 2024 బ్యాచ్లో ఎంపికయ్యాడు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఏసీపీ కార్యాలయానికి అటాచ్మెంట్ లో వున్నాడు. కర్మన్ఘాట్లో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివాసం వున్నాడు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కామినేని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** వేగంగా వచ్చిన ట్యాంకర్ ను ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ఆదే సమయంలో అదే హైవేపై వరుసగా మూడు ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో మరో ఇద్దరు మృతి చెందారు. . మరో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. రెండు రోడ్డుప్రమాదాల్లో మొత్తం 9 మంది మృతి చెందారు. ప్రమాద సమయంలో ఆటలో 14 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో ఘటన జరిగింది. ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి. దిగ్భ్రాంతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు...

**హైదరాబాద్, ఆగస్టు 12, పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈ-వేలంలో ఉంచారు.

హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరొక భారీ ఈ-వేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి అధికారులు నోటిఫికేషన్ సిద్ధం చేశారు. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్‌ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది. అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలిస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈ-వేలం జరగనుంది. ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్‌ఎండీఏ అమ్మకానికి ఉంచింది. కూకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బైరాగిగూడ, చందానగర్, సూరారం, కాప్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు. ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు

# మెయినాబాద్ లో 200 కోట్లతో పూలు, కూరగాయలు మార్కెట్

**హైదరాబాద్, ఆగస్టు 12 పెన్ పవర్:**

హైదరాబాద్ శివారులో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లో మొత్తం 39.07 ఎకరాలను మార్కెటింగ్ శాఖకు కేటాయించింది. మార్కెట్‌లో శీతల గిడ్డంగులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, భారీ భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంగా ఉండటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల రవాణా, దేశీయ, విదేశీ ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు, పూలు కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో 39.07 ఎకరాల భూమిని కేటాయించారు. మార్కెట్ నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 176/పీలో 23.22 ఎకరాలు, హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 151/పీలో 15.25 ఎకరాలు కలిపి మొత్తం 39.07 ఎకరాలను రెవెన్యూ శాఖ మార్కెటింగ్ శాఖకు బదలాయించింది. భూమి బదలాయింపు పూర్తవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనపై కసరత్తు ప్రారంభించారు. మార్కెట్ నిర్మాణం, విస్తీర్ణం, మౌలిక వసతులు, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలు తదితర అంశాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు. దేశంలో పూల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన బెంగళూరులోని కృష్ణరాజేంద్ర మార్కెట్‌ను అధికారులు ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సమాచారం. అక్కడి మార్కెట్ పనితీరును పరిశీలించిన అధికారులు.. దానికంటే పెద్దదిగా, ఆధునిక సదుపాయాలతో హైదరాబాద్ మార్కెట్‌ను తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించారు. ప్రతిపాదిత మార్కెట్‌లో భారీ మార్కెట్ భవనాలు, ప్రత్యేక విక్రయ వేదికలు, లోడింగ్-- అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా తరలించేందుకు అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండటం వల్ల నాణ్యమైన పూలు, త్వరగా పాడయ్యే కూరగాయలను దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు విదేశీ మార్కెట్లకు కూడా తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో పూలకు ప్రత్యేకంగా పెద్ద మార్కెట్ లేకపోవడంతో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కూరగాయలతోపాటు పూల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటైతే వేలం, ధర నిర్ణయం, నిల్వ, రవాణా వంటి వ్యవస్థలు ఒకే చోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు మార్కెట్ సమాచారం, మెరుగైన ధరలు లభించడంతోపాటు పంట నష్టాలు తగ్గే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 4,402 ఎకరాల్లో వివిధ రకాల పూలు, 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో దాదాపు 60 శాతం సాగు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనే జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. నగరానికి సమీపంలోనే భారీ వినియోగ మార్కెట్ ఉండటం రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తగిన మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలో ప్రతిపాదిత మార్కెట్ పూర్తయితే పూలు, కూరగాయల రైతులకు కొత్త మార్కెట్ వేదికగా మారనుంది. ఉత్పత్తిదారులు, వ్యాపారులు, హోల్‌సేల్ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో మార్కెటింగ్ వ్యవస్థ మరింత వ్యవస్థీకృతమయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, హైదరాబాద్ నగరానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలకు ఈ మార్కెట్ కీలకంగా మారనుంది.

# అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్!

**హైదరాబాద్, ఆగస్టు 12, పెన్ పవర్:**

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే. హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు

**హైదరాబాద్, ఆగస్టు 12, పెన్ పవర్:**

తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్ , నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తేలుతున్నాయి. మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అన ర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్‌ఓల ద్వారా ఫారమ్-6, ఫారమ్-8 దాఖలు చేసి రీ-ఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

# రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..

**హైదరాబాద్, ఆగస్టు 12, పెన్ పవర్:**

రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు. అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది. మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# ఈ కేవైసీ కోసం ఆగస్టు 31లోపు డెడ్ లైన్




**హైదరాబాద్, ఆగస్టు 12, పెన్ పవర్:**

దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియ ను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదా రులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే ఈ కేవైసీ కోసం ప్రత్యేకంగా కేంద్రాలకు వెళ్లకుండా ఇంట్లోనే మొబైల్ ద్వారా కూడా పూర్తి చేయొచ్చు. గ్యాస్ కనెక్షన్లు నిజమైన లబ్ధిదారుల పేర్లలోనే కొనసాగుతున్నాయా..? లేదా అనే విషయాన్ని నిర్ధారించడం కోసమే ఈ ఈ కేవైసీ. ఒకే వ్యక్తి పేరుతో ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండటం.. తప్పుడు వివరాలతో కనెక్షన్లు తీసుకోవడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధ్రువీకరణను చేపడుతున్నాయి. దీంతో అర్హులైన వినియోగదారులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేవైసీ పూర్తి చేయడానికి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలంటే కొందరికి ఇబ్బందులు ఉంటాయి. దీంతో ఆ అవసరం లేకుండా ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా దీనిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం మీరు ఏ కంపెనీ గ్యాస్ కనెక్షన్ ఉపయోగిస్తున్నారో దానికి అనుగుణంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా ఆ కంపెనీ వెబ్ సైట్ నుంచి కూడా ఈ ప్రక్రియను చేయొచ్చు. ముందుగా గ్యాస్ కంపెనీ యాప్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ప్రొఫైల్ లేదా మై అకౌంట్ విభాగంలోకి వెళ్లి 'ఈకేవైసీ లేదా రీ వెరిఫికేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు కోసం ఆధార్ ఫేస్ ఆర్ డీ యాప్ ఓపెన్ అవుతుంది. ముఖంపై సరిపడా వెలుతురు ఉండేలా చూసుకుని కెమెరా ద్వారా ఫేస్ స్కాన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ విజయవంతమైతే ఈ కేవైసీ పూర్తయినట్లు స్క్రీన్‌పై సమాచారం కనిపించడంతో పాటు కన్ఫర్మేషన్ మెసేజ్ కూడా వస్తుంది ఫేస్ స్కాన్ చేసే సమయంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఉండాలి. కళ్లద్దాలు, మాస్క్, టోపీ వంటివి తొలగించడం మంచిది. ఇంటర్నెట్ కనెక్షన్ బాగా ఉండాలి. అలాగే ఆధార్‌లో నమోదైన వ్యక్తే స్కాన్ చేయాలి. లేదంటే ధృవీకరణ విఫలమయ్యే అవకాశం ఉంటుంది. చాలా మంది ఒకేసారి ఈ కేవైసీ చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై ఒత్తిడి పెరిగి యాప్ నెమ్మదిగా పనిచేసే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం తొందరగా లేదా రాత్రి సమయంలో ఈ కేవైసీ ప్రయత్నిస్తే ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వినియోగదారులు చెబుతున్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అజెండా ఇదే.. ఫిక్స్ అయిన జగన్

**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై విపక్షం వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17 నుంచి శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు మొదలు కానున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తుండగా, సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అదేసమయంలో శాసనసభతోపాటు మండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వెళ్లాలని నిర్ణయించారు. అదేసమయంలో శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేలా పలు అస్త్రాలను సిద్ధం చేయాలని చర్చించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని వైసీపీ నిర్ణయించింది. శాసనమండలి సమావేశాల్లో ఇదే ప్రధాన అజెండాగా చర్చకు పట్టుబడాలని ఆ పార్టీ నిర్ణయించిందని చెబుతున్నారు. అంతేకాకుండా మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాజీ సీఎం జగన్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. శాసనమండలికి యథావిధిగా హాజరుకావడంతోపాటు అసెంబ్లీ బయట రకరకాల కార్యక్రమాలతో డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.

ఇక అసెంబ్లీ ప్రారంభానికి ఐదు రోజులు ముందుగానే విపక్షం అజెండా ఫిక్స్ చేయడం రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై వైసీపీ అనేక రకాలుగా ఆందోళనలు చేస్తోంది. రిలే నిరాహారదీక్షలతోపాటు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భావిస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఈ విషయంపై శాసనమండలిలో తాడోపేడో తేల్చుకుంటామని తేల్చిచెప్పడంతో వర్షాకాల సమావేశాలకు ముందే రాజకీయం కాకపుట్టిస్తోందని చెబుతున్నారు.



విపక్షం అజెండా ఎలా ఉండబోతుందో తేలిపోవడంతో ఇక ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. అసెంబ్లీకి రామని చెబుతున్న వైసీపీ తమ ఆరోపణలు మాత్రం ఆపమని తేల్చిచెబుతోంది. దీంతో విపక్షానికి సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ఏ మార్గం ఎంచుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది.

శాసనమండలిలో ఇప్పటికీ విపక్షానికే బలం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ వాదనను సమర్థంగా తీసుకువెళ్లే అవకాశాలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో బలం ఉన్నప్పటికీ వైసీపీ సభ్యులు హాజరుకాకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా సాగిపోనున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వ వాదన ప్రజల్లోకి వెళుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ అసెంబ్లీ అజెండాపై వైసీపీ ముందుగానే స్పష్టత ఇవ్వడంతో ఈ సారి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయని

# ఇంటెలిజెన్స్ వైఫల్యమేనా అధికార పార్టీలో అనుమానాలు

**కర్నూలు, ఆగస్టు 12, పెన్ పవర్:**
కర్నూలులో శాంతి భద్రతల సమస్యలపై మంత్రి టీజీ భరత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఒకవైపు హోం మంత్రి అనిత లా అండ్ ఆర్డర్ బాగుందంటూ చెబుతూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం రౌడీషీటర్లను పీచమణిచేస్తానని ప్రతి సభలో హుంకరిస్తున్నారు. కానీ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్న టీజీ భరత్ మాత్రం కర్నూలులో ఇంటలిజెన్స్ తో పాటు అధికార వ్యవస్థ కూడా పూర్తిగా విఫలమయిందని ఆరోపణలు చేయడం సూటిగా కూటమి ప్రభుత్వానికి తాకినట్లయింది. మంత్రి టీజీ భరత్ ఈ వ్యాఖ్యలు ఆయన ఆవేదనలో భాగమయి ఉండవచ్చు. కానీ అది ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే విధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున ప్రత్యర్థులు దానిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు... కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ హత్య ఘటనపై పోలీసుల నిఘా వైఫల్యమంటూ ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు ముందే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎందుకు స్పందించలేదని నిలదీశారు.ద

మంత్రుల కదలికలపై నిఘా పెట్టే అధికారులు నేరస్థులపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.పోలీసుల తీరుపై మంత్రి టీజీ భరత్ అసంతృప్తి కర్నూలులో శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నిఘా వ్యవస్థ పనితీరులో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు.హత్యకు ముందే బాధితుడి ఫోటో పెట్టి సోషల్ మీడియాలో '=ఖ్రా' అని పోస్ట్ చేసినా పోలీసులు గుర్తించలేకపోవడంపై అసంతృప్తి వెళ్లి బుచ్చారు.మంత్రులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే విషయాలపై ఉండే శ్రద్ధ.. నేరస్థుల కదలికలపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు.ఈ ఘటనపై సీఎంను కలిసి ఫిర్యాదు చేస్తానని, రౌడీ మూకల అరాచకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కర్నూలులో రౌడీలు రెచ్చిపోతున్నారని మంత్రి భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్యలకు తెగబడుతున్నారని మంత్రి భరత్ఇంతియాజ్ హత్య అంటూ వారం క్రితమే సోషల్ మీడియాలో వచ్చిందని, మంత్రులు,
ఎమ్మెల్యేలు, నేతలపై వాళ్ల నిఘా పెడుతుంటే..పోలీసులు ఏం చేస్తున్నారంటూ మంత్రి భరత్ ప్రశ్నించడం కూటమి ప్రభుత్వంలోని శాంతి భద్రల సమస్యను ఎత్తి చూపుతుందని విపక్ష వైసీపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమయిందని, అందుకు తాము కాదని, మంత్రి భరత్ వ్యాఖ్యలే ఉదాహరణ అని చెబుతున్నారు. తన పార్టీ నేత హత్యతో ఆవేదనకు గురైనా మంత్రి టీజీ భరత్ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలుగా చూడాలని కూటమిలోని నేతలు సర్దిచెప్పుకుంటున్నా.. అది ప్రభుత్వాన్ని మాత్రం డ్యామేజీ చేసే విధంగా ఉందన్న వ్యాఖ్యలు మాత్రం వినిపిస్తున్నాయి. దీనిపై టీజీ భరత్ ను పార్టీ నాయకత్వం వివరణ కోరే అవకాశాలు లేకపోలేదు.


# కోవర్ట్ రాజకీయాలు - టీడీపీ వర్గాల అనుమానాలు

**ఒంగోలు, ఆగస్టు 12 పెన్ పవర్:**
ప్రకాశం జిల్లా ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి , స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ల మధ్య తలెత్తిన రాజకీయ వైరం తీవ్ర రూపం దాల్చుతోంది. వైఎస్సార్సీపీ ని వీడి జనసేనలో చేరినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే దామచర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించడం, దానికి ప్రతిగా దామచర్ల కూడా సవాళ్లు విసరడంతో ఒంగోలు రాజకీయాలు కూటమి వర్సెస్ కూటమి అనే స్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల కుటుంబాల మధ్య రాజకీయ వైరం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గతంలో ఇరు నాయకులు ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీపడేవారు. అయితే బాలినేని జనసేన పార్టీలో చేరినప్పటికీ, పాత విభేదాలు మాత్రం వీడలేదు. ఒంగోలుపై తన పట్టు నిలుపుకోవాలని బాలినేని ప్రయత్నిస్తుంటే, సిట్టింగ్ ఎమ్మెల్యేగా పూర్తి ఆధిపత్యం చెలాయించాలని దామచర్ల భావిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒంగోలు రాజకీయాన్ని శాసించడమే కావడంతో ఈ ఘర్షణ వ్యక్తిగత స్థాయికి చేరింది. తాజాగా బాలినేని తన అనుచరులను కాపాడుకునేందుకు నేరుగా రంగానికి దిగారు. స్థానిక పోలీసులు ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిళ్లతో తన వర్గానికి చెందిన వారిపై, జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి కౌంటర్గా.. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అక్రమాల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేన ముసుగు వేసుకున్నారని, ఒంగోలులో రౌడీయిజం చెల్లదని దామచర్ల విమర్శలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రమైంది.జనసేనలో చేరినప్పటికీ బాలినేని వైఎస్సార్సీపీ నాయకులకు మద్దతుగా పనిచేస్తున్నారని, టీడీపీ–జనసేన కూటమిలో చిచ్చు పెట్టేందుకు 'కోవర్ట్'గా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్సీపీ నేతలపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి , తన పాత కేడర్ను కాపాడుకోవడానికి జనసేన జెండాను వాడుకుంటున్నారనే ఆరోపణలు టీడీపీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నాయకుల మధ్య సాగుతున్న ఈ పోరు సోషల్ మీడియా వార్గా మారి, ఇప్పుడు నేరుగా వీధుల్లోకి వచ్చే వాతావరణం కనిపించడం వల్ల టీడీపీ, జనసేన దిగువ స్థాయి కేడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ఎన్నికల్లో కలసి పనిచేసిన రెండు పార్టీల శ్రేణులు ఇప్పుడు పరస్పరం పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వల్ల ఉమ్మడి క్యాడర్ స్ఫూర్తి దెబ్బతింటోంది.ఒంగోలులో సాగుతున్న ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి నేతలే ఒకరిపై ఒకరు ఇసుక, మద్యం అవినీతి ఆరోపణలు చేసుకోవడం ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారింది. ఈ సెగ కేవలం ఒంగోలుకే పరిమితం కాకుండా ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకితే, కూటమిలోని టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది.పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో టీడీపీ, జనసేన అధిష్టానాలు త్వరితగతిన స్పందించాయి. ఇరు పార్టీల సీనియర్ నేతలు కలసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఇద్దరు నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ విమర్శలు ఆపి, ఏవైనా సమస్యలు ఉంటే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి – దామచర్ల జనార్ధన్ ల మధ్య పోరు కేవలం ఒక స్థానిక నియోజకవర్గ సమస్య కాదు. స్థానికంగా బలంగా ఉన్న పాత ప్రత్యర్థులు కూటమి గొడుగు కిందకి వచ్చినప్పుడు తలెత్తే సవాళ్లకు ఇది అద్దం పడుతోంది. అధిష్టానాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యక్తిగత ఆధిపత్య పోరు కూటమి ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

మరో వైపు సమన్వయ కమిటీ నాయకులు ఒంగోలు పరిణామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత నేతల నుంచి నేరుగా తెలుసుకునేందుకు జూమ్ ద్వారా మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అనంతరం సమస్యలు ఏమైనా ఉంటే పార్టీ వ్యవస్థలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి లేదా కూటమికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా ప్రత్యర్థులకు అవకాశం కల్పించినట్లవుతుందని హెచ్చరించారు.నేతలు తమ సమస్యలను పార్టీ అధిష్టానాలు, సమన్వయ కమిటీల దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతున్న సమయంలో చిన్నపాటి విభేదాలు పెద్ద రాజకీయ అంశాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి బలంగా ఉంటేనే ప్రభుత్వానికి రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, అందువల్ల వ్యక్తిగత విభేదాల కంటే సమిష్టి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఒంగోలు వివాదంపై తాజా చర్యలతో ఇకపై కూటమి భాగస్వామ్య పార్టీల నేతల మధ్య సమన్వయానికి మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ విమర్శలకు దూరంగా ఉండి, సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం స్పష్టంగా ఇచ్చినట్లయింది.

## బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

**నెల్లూరు, ఆగస్టు 12, పెన్ పవర్:** వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు.



ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృథా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

# నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

**విజయవాడ, ఆగస్టు 12, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ – నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు.అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ – నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్–మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ – నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**వైసీపీ వ్యూహం ఏమిటీ...**

అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రెండేళ్లలో 300 ఫ్యామిలీల మేజిక్.. ఆ నాలుగు ధనిక దేశాలను దాటేసింది!



ఆసక్తికర ఆర్థిక విశ్లేషణతో పాటు.. వావ్ అనే ఒక జాబితాను విడుదల చేసింది బార్ క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా రిపోర్టు. ఇండియా మోస్ట్ వాల్యుబుల్ ఫ్యామిలీ బిజినెసెస్ లిస్ట్ పేరుతో విడుదల చేసిన ఈ రిపోర్టును సింపుల్ గా చెప్పేస్తే.. కేవలం రెండేళ్ల వ్యవధిలో మన దేశానికి చెందిన 300 పారిశ్రామిక కుటుంబాలు సృష్టించిన సంపద నాలుగు సంపన్న దేశాల జీడీపీని దాటేయటం. ఇక్కడే మరో ఆసక్తికర అంశం ఏమంటే.. గడిచిన రెండేళ్లలో స్టాక్ మార్కెట్ సూచీలైన నిఫ్టీ 50, సెన్సెక్స్ లు నష్టపోయినా వీరి కుటుంబాల సంపద మాత్రం 27.5 శాతం పెరగటం గమనార్హం. ఈ రిపోర్టును తరచి చూస్తే బోలెడన్ని ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి.ఈ రిపోర్టు ప్రకారం మన దేశానికి చెందిన 300 వ్యాపార కుటుంబాలు క్రియేట్ చేసిన సంపద ఏకంగా రూ.138 లక్షల కోట్లకు చేరుకున్నట్లుగా పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోని పద్దెనిమిదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థతో సమానంగా పోల్చింది. అంతేకాదు.. నెదర్లాండ్స్.. సౌదీ అరేబియా.. స్విట్జర్లాండ్.. పోలాండ్ లాంటి సంపన్న దేశాల జీడీపీతో సమానంగా లెక్క కట్టింది. ముందే చెప్పినట్లు గడిచిన రెండేళ్లలో నిఫ్టీ 1.1 శాతం.. సెన్సెక్స్ 3.7 శాతం క్షీణించింది. కానీ.. ఈ సంపన్నుల కుటుంబాల సంపద మాత్రం దూసుకెళ్లటం.. అది కూడా రెండెంకలతో ఉండటం విశేషం.మరో అంశం ఏమంటే.. ఈ మూడు వందల కుటుంబాల రోజువారీ సగటున ఎంత సంపదను క్రియేట్ చేశారంటే.. రూ.4076 కోట్లుగా లెక్కేశారు. ఈ 300 వ్యాపార కుటుంబాల్లోనూ టాప్ 10 కుటుంబాల సంపద విలువ మొత్తం జాబితాలోని సంపదలో 51 శాతం కావటం మరో విశేషంగా చెప్పాలి. అంటే.. 300 వ్యాపార కుటుంబాలు రెండేళ్లలో రూ.138 లక్షల కోట్ల సంపదను సృష్టిస్తే.. అందులో 51 శాతం, అంటే..70 లక్షల కోట్లు జాబితాలోని టాప్ 10 కుటుంబాలే క్రియేట్ చేసినట్లుగా తేల్చారు.ఈ రిపోర్టు మరింత బాగా అర్థం అయ్యేందుకు ఒక పోలిక చెబితే ఇట్టే అర్థమవుతుంది. మొత్తం 300 వ్యాపార కుటుంబాల్లో టాప్ 50 కుటుంబాల జాబితాలో చేరాలంటే వారి కనీస సంపద రూ.52,100 కోట్లు. అదే టాప్ 200 జాబితాలో ఉండాలంటే కనీసం రూ.5వేల కోట్ల సంపద ఉన్నోళ్లనే చేర్చారు. ఇక.. జాబితాలోని 300 మందిలో కనీసం రూ.1300 కోట్ల సంపద కలిగినోళ్లకు మాత్రమే చోటు దక్కింది.సంపద పరంగా అంబానీ ఫ్యామిలీనే తొలి స్థానంలో నిలిచారు. గడిచిన ఏడాదిలో రిలయన్స్ విలువ 8.5 శాతం తగ్గినా.. రూ.35.8 లక్షల కోట్లతో తొలి స్థానంలో నిలవగా.. రెండో స్థానంలో కుమార్ మంగళం బిర్లా ఫ్యామిలీ నిలిచింది. మొదటి.. రెండు స్థానాల మధ్య అంతరం భారీగా ఉండటం మరో ఆసక్తికర అంశం. కుమార్ మంగళం బిర్లా ఫ్యామిలీ రూ.81.4 లక్షల కోట్ల సంపదతో పోలిస్తే అంబానీ ఫ్యామిలీ సంపద మూడు రెట్లు అధికంగా ఉన్నట్లు లెక్క కట్టారు. కుమార మంగళం బిర్లా కుటుంబ వ్యాపారాల విలువ ఏడాది కాలంలో 26 శాతం పెరగటం ఒక ఎత్తు అయితే.. మూడో స్థానంలో నిలిచిన జిందాల్ ఫ్యామిలీ వ్యాపార విలువ ఏడాదిలో 40 శాతం వృద్ధిని నమోదు చేయటం ఆసక్తికర అంశంగా చెప్పాలి.రెండో స్థానంలో ఉన్న కుమార మంగళం బిర్లా (రూ.8.14 లక్షల కోట్లు)తో పోలిస్తే జిందాల ఫ్యామిలీ సంపదకు (రూ.8.02 లక్షల కోట్లు) మధ్య తేడా చాలా తక్కువగా ఉంది. నాలుగో స్థానంలో బజాజ్ కుటుంబం (రూ.7.7లక్షల కోట్లు).. ఐదో స్థానంలో మహీంద్రా కుటుంబం (రూ.5.5 లక్షల కోట్లు) నిలిచింది. ఇదంతా చదువుతున్నప్పుడు ఒక సందేహం రావటం ఖాయం. అంబానీల తర్వాత అదానీ ఫ్యామిలీ ఉండాలి కదా? కుమార మంగళం బిర్లా ఎందుకు నిలిచారు? టాప్ 5లో అదానీ ఫ్యామిలీ ఎందుకు లేదన్న అంశంలోకి వెళితే.. ఈ రిపోర్టును రెండు రకాలుగా వర్గీకరణ చేయటమే దీనికి కారణం.ఈ రిపోర్టును రెండు రకాలుగా విభజించారు. మల్టీ జనరేషన్ వ్యాపార కుటుంబం.. ఫస్ట్ జనరేషన్ (మొదటి తరం) వ్యాపార కుటుంబాలుగా వర్గీకరించారు. తొలి జాబితాలోని టాప్ 5 వ్యాపార కుటుంబాల్ని చూస్తే అంబానీ.. బిర్లా.. జిందాల్.. బజాజ్.. మహీంద్రా కుటుంబాలు నిలుస్తాయి. మొదటి తరం వ్యాపార కుటుంబాల జాబితాలో గౌతమ్ అదానీ కుటుంబం నిలుస్తుంది. గౌతమ్ అదానీ తన స్వయంకృషితో అతి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన సంగతి అందరికి తెలిసిందే. దీంతో మొదటి జాబితాలోని సాంప్రదాయ మల్టీ జనరేషన్ జాబితాకు భిన్నంగా.. స్వశక్తితో ఎదిగిన వ్యాపార కుటుంబాల జాబితాను వేరుగా తయారు చేశారు.తొలి తరం వ్యాపార కుటుంబాల జాబితాను చూస్తే.. ఇందులో మొదటి స్థానం అదానీ ఫ్యామిలీ నిలిచింది. వీరి సంపద రూ.19.6 లక్షల కోట్లుగా ఉండగా.. రెండో స్థానంలో భారతీ ఎయిర్ టెల్ కు చెందిన సునీల్ భారతీ మిట్టల్ ఫ్యామిలీ (రూ.12.1 లక్షల కోట్లు).. మూడో స్థానంలో సన్ ఫార్మా సంస్థకు చెందిన దిలీప్ సంఘ్వీ కుటుంబం (రూ.4.55 లక్షల కోట్లు).. నాలుగో స్థానంలో సీరమ్ ఇన్ స్టిట్యూట్ కు చెందిన సైరస్ పూనావాలా ఫ్యామిలీ (రూ.2.98 లక్షల కోట్లు).. ఐదో స్థానంలో డిమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ ఫ్యామిలీ (రూ.2.86 లక్షల కోట్లు) నిలిచింది.ఇక్కడో ఆసక్తికర పోలిక పోలిస్తే.. మొత్తం 300 వ్యాపార కుటుంబాల్లో రెండు జాబితాల్లోని టాప్ 5 కుటుంబాలు.. టాప్ 10 కుటుంబాల సంపద ఎంత భారీ అన్న విషయాన్ని చూస్తే.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. మల్టీ జనరేషన్ (బహుళ తరాల) వ్యాపార కుటుంబాల్లో టాప్ 5, ఫస్ట్ జనరేషన్ వ్యాపార కుటుంబాల్లోని టాప్ 5 సంపద కలిపితే.. మొత్తంలో 70.8 శాతం ఉండటం కనిపిస్తుంది. అదే సమయంలో రెండు జాబితాల్లో టాప్ 10 వ్యాపార కుటుంబాలు (అంటే మొత్తం 300 వ్యాపార కుటుంబాల్లో 20 వ్యాపార కుటుంబాల) సంపదను లెక్కిస్తే.. మొత్తం సంపదలో 87.38 శాతం ఇరవై కుటుంబాల చేతుల్లో ఉండటం కనిపిస్తుంది. పేరుకు 300 వ్యాపార కుటుంబాలతో (రూ.138 లక్షల కోట్లు) జాబితాను సిద్ధం చేసినా.. 20 వ్యాపార కుటుంబాల సంపద రూ.120.59 లక్షల కోట్లు (అంటే సుమారు 88 శాతం) ఉండటం విశేషం.రెండు జాబితాల్లోనూ టాప్ 5 వ్యాపార కుటుంబాల లెక్కలు చూశాం. మరి.. టాప్ 6 నుంచి 10స్థానాల్లో చోటు దక్కించుకున్న వ్యాపార కుటుంబాల లెక్కల్ని చూస్తే.. మరింత వివరంగా విషయాలు తెలుసుకున్నట్లు అవుతుందని చెప్పాలి. బహుళ తరాల వ్యాపార కుటుంబాల టాప్ 6-10జాబితాను చూస్తే..టాప్ 6లో హెచ్ సీఎల్ టెక్నాలజీస్ కు చెందిన నాడార్ ఫ్యామిలీ (రూ.4.68 లక్షల కోట్లు).. టాప్ 7లో చోళమండలం ఇన్వెస్ట్ మెంట్ అలియాస్ మురుగప్ప గ్రూప్ కు చెందిన మురుగప్ప ఫ్యామిలీ (రూ.2.92 లక్షల కోట్లు) నిలిస్తుంది. టాప్ 8లో విప్రో అధినేత ప్రేమ్ జీ ఫ్యామిలీ (రూ.2.78 లక్షల కోట్లు) నిలవగా.. టాప్ 9లో వేదాంత, హిందుస్తాన్ జింక్ కు చెందిన అనిల్ అగర్వాల్ కుటుంబం (రూ.2.55 లక్షల కోట్ల) నిలుస్తాయి. టాప్ 10 స్థానంలో ఏషియన్ పెయింట్స్ అధినేత దానీ, చోక్సీ అండ్ వకీల్ కుటుంబం (మూడు కుటుంబాలు) సంయుక్తంగా (రూ.2.20 లక్షల కోట్లు) నిలుస్తాయి.ఇక.. తొలి తరం వ్యాపార కుటుంబాలకు చెందిన టాప్ 6-10 స్థానాల్లో ఎవరు నిలిచారంటే.. ఎనర్జీ, ఎన్విరాన్ మెంట్ ఇంజనీరింగ్ లో దూసుకెళుతున్న థర్మాక్స్ సంస్థ అధినేత మెహర్ పుదుంజీ కుటుంబం (రూ.61,500 కోట్లు) టాప్ 6 స్థానంలో నిలిస్తే.. టాప్ 7 స్థానంలో గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియాకు నేతృత్వం వహిస్తున్న బీనా మోదీ ఫ్యామిలీ (రూ.38,900 కోట్లు) నిలుస్తుంది. జాబితాలో టాప్ 8వ స్థానంలో భారతదేశ అతి పెద్ద దుస్తుల ఎగుమతి సంస్థ షాహీ ఎక్స్ పోర్ట్స్ అధినేత అహుజా ఫ్యామిలీ (రూ.37,500 కోట్లు), టాప్ 9 స్థానంలో ఫార్మా రంగంలో పేరున్న యూఎస్ వీ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న లీనా గాంధీ తివారీ ఫ్యామిలీ (రూ.32,500 కోట్లు), టాప్ 10 స్థానంలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ వ్యాక్సిన్, బయో ఫార్మాస్యూటికల్స్ తయారీ సంస్థ బయోలాజికల్ ఇ అధినేత్రి మహిమా దాట్ల కుటుంబం (రూ.22వేల కోట్లు) నిలుస్తుంది.మొత్తం 300 వ్యాపార కుటుంబాల్లో 20 వ్యాపార కుటుంబాల సంపదే సుమారు 88 శాతం ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడే మరో లెక్క వేస్తే.. అదిరే అంశాలు కనిపిస్తాయి. అదేమంటే.. మల్టీ జనరేషన్ లోని టాప్ 5 వర్సెస్ ఫస్ట్ జనరేషణ్ టాప్ వ్యాపార కుటుంబాలు. అదే విధంగా మల్టీ జనరేషన్ లోని టాప్ 6-10 వ్యాపార కుటుంబాలు వర్సెస్ ఫస్ట్ జనరేషన్ టాప్ 6-10 వ్యాపార కుటుంబాలను పోల్చి చూస్తే ఆసక్తికర ఆర్థిక అంశాలు కనిపిస్తాయి.తొలుత మల్టీ జనరేషన్ కు చెందిన టాప్ 5 వర్సెస్ ఫస్ట్ జనరేషన్ టాప్ 5 వ్యాపార కుటుంబాలను పోల్చి చూస్తే.. వీరి మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా కనిపిస్తుంది. మల్టీ జనరేషన్ టాప్ 5 కుటుంబాల మొత్తం సంపద రూ.55.66 లక్షల కోట్లు కాగా.. ఫస్ట్ జనరేషన్ టాప్ 5 వ్యాపార కుటుంబాల మొత్తం సంపద రూ.42.09 లక్షల కోట్లు. అంటే.. వీరి మధ్య సంపద వ్యత్యాసం రూ.13.5 లక్షల కోట్లు. అంటే.. సంప్రదాయ వ్యాపార కుటుంబాలకు మొదటి తరం వ్యాపార కుటుంబాలు గట్టి పోటీ ఇస్తున్నట్లుగా స్పష్టమవుతుంది. దీనికి కారణం ఫస్ట్ జనరేషన్ లోని అదానీ.. సునీల్ భారతీ మిట్టల్ ఫ్యామిలీ క్రియేట్ చేసిన భారీ సంపదే.మరి.. మల్టీ జనరేషన్ లోని టాప్ 6-10 వ్యాపార కుటుంబాలు వర్సెస్ ఫస్ట్ జనరేషన్ కు చెందిన టాప్ 6-10 వ్యాపార కుటుంబాల సంపదను పోలిస్తే.. ఇక్కడ తేడా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. మల్టీ జనరేషన్ లోని టాప్ 6-10 కుటుంబాల మొత్తం సంపద రూ.15.13 లక్షల కోట్లు అయితే.. జాబితాలోని టాప్ 6-10 స్థానాల్లో నిలిచిన ఫస్ట్ జనరేషన్ వ్యాపార కుటుంబాల మొత్తం సంపద రూ.1.92 లక్షల కోట్లు మాత్రమే. అంటే.. మల్టీ జనరేషన్ లోని సంప్రదాయ వ్యాపార కుటుంబాల సంపద.. మొదటి తరం వ్యాపార కుటుంబాల కంటే ఏకంగా 8 రెట్లు ఎక్కువగా ఉండటం కనిపిస్తుంది.మొత్తంగా చూస్తే టాప్ 5 స్థానాల్లో నిలిచిన మొదటి తరం వ్యాపార కుటుంబాలు, పాత తరం వ్యాపార కుటుంబాలకు సమానంగా నిలిస్తే.. 6-10 స్థానాల విషయానికి వస్తే మాత్రం పాతతరం వ్యాపార కుటుంబాలు చాలా పెద్దవిగా కనిపిస్తాయి. అదే సమయంలో మొదటి తరం వ్యాపారాలు ఇంకా ఎదుగుతున్న దశలో ఉన్న అంశం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ఇదంతా చూస్తే రాబోయే పది - పదిహేనేళ్లలో మొదటి తరం వ్యాపార కుటుంబాలే తర్వాతి కాలపు మల్టీ జనరేషన్ దిగ్గజాలుగా మారే అవకాశాలు ఉన్నట్లుగా కనిపిస్తున్నాయని చెప్పక తప్పదు.

# ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి చెక్.. పార్లమెంటరీ కమిటీ కీలక సూచన



మెట్రో నగరాల్లో భారీగా పెరుగుతున్న వైద్య ఖర్చులకు అడ్డుకట్ట వేసేలా పార్లమెంటరీ కమిటీ కీలక సిఫార్సులు చేసింది. సామాన్యుడికి ప్రైవేటు వైద్యం భారంగా మారుతున్న పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సంచలన నివేదికను సమర్పించింది. ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటుపై రూపొందించిన 176 పేజీల నివేదికలో దేశవ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల ధరల విధానంపై కీలక సూచనలు చేసింది. కార్పొరేట్ ఆస్పత్రులు ఇష్టానుసారంగా ధరలు వసూలు చేయకుండా ఆయా నగరాల్లో 3స్టార్ హోటల్ గదుల ధరలను ప్రామాణికంగా తీసుకునే విధంగా పార్లమెంటరీ కమిటీ సూచనలు చేసింది.

మెట్రో నగరాల్లోని ప్రైవేటు ఆసుపత్రులలో రూం అద్దెలను నియంత్రించడంపై పార్లమెంటరీ కమిటీ కీలక సూచనలు చేసింది. ఆసుపత్రిలో సాధారణ గది అద్దె, అదే ప్రాంతంలోని త్రీ-స్టార్ హోటల్ గది సగటు అద్దె కంటే ఎక్కువగా ఉండకూడదని స్పష్టం చేసింది. చికిత్స పొందే రోగులకు రూం అద్దెలు మితిమీరిన భారాన్ని మోపుతున్నట్లు సభ్యులు గుర్తించారు. దీంతో ఆస్పత్రులలో అద్దె గదుల ధరలపై నియంత్రణ ఉండేలా హోటల్ గదుల అద్దెలను బెంచ్‌మార్కుగా తీసుకోవాలని కమిటీ ప్రతిపాదించింది.

**వసతులు వేరు.. ధరల నిర్ణయం వేరు**

హోటల్ గదులకు, ఆసుపత్రి గదులకు సేవల పరంగా భారీ వ్యత్యాసం ఉంటుందని కమిటీ గుర్తించినట్లు చెబుతున్నారు. హోటల్ కేవలం బస కల్పిస్తే, ఆసుపత్రి గదులు నర్సింగ్ కేర్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, అత్యవసర వైద్యసేవల పర్యవేక్షణ వంటి కీలక సేవలతో కూడుకుని ఉంటాయని అంటున్నారు. అయినప్పటికీ, ధరల నియంత్రణకు ఒక ప్రామాణికం అవసరమని కమిటీ భావిస్తోందని అంటున్నారు. గతంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా ఇదే తరహాలో ఆసుపత్రుల ధరలను పరిశీలించినప్పటికీ, వైద్య సేవలను హోటల్ సేవలతో సమానం చేయలేమని పేర్కొనడం గమనార్హం.

**పారదర్శకమైన బిల్లింగ్ విధానం**

గది అద్దెలతో పాటు, రోగులకు అందించే వైద్య పరీక్షలు, చికిత్సల ధరలలో పూర్తి పారదర్శకత ఉండాలని కమిటీ స్పష్టం చేసింది. ఆపరేషన్ లేదా పెద్ద చికిత్సకు ముందు, మొత్తం చికిత్సకు అయ్యే ఖర్చుపై రోగి కుటుంబానికి స్పష్టమైన అంచనా ఇవ్వాలని అభిప్రాయపడింది. ఇన్సూరెన్స్ ఉన్న రోగులకు ఒకలా, లేని వారికి మరోలా ధరలు నిర్ణయించే 'డిఫరెన్షియల్ ప్రైసింగ్' విధానాన్ని పరిశీలించాలని కోరింది. కాగా, పార్లమెంటరీ కమిటీ నివేదికపై ప్రైవేటు ఆసుపత్రులు భిన్నంగా స్పందిస్తున్నాయి. ఆసుపత్రులు అందించే మౌలిక సదుపాయాలు, వైద్య సేవలను బట్టి ధరలను నిర్ణయించుకునే స్వేచ్ఛ యాజమాన్యాలకే ఉండాలని వాదిస్తున్నాయి. రోగుల ఆర్థిక స్తోమతకు అనుగుణంగా గదిని ఎంచుకునే ఆప్షన్ ఇప్పటికే అందుబాటులో ఉందని అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ అలెగ్జాండర్ థామస్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో ఈ అంశంపై చర్చిస్తామని వారు తెలిపారు. మరోవైపు సుప్రీంకోర్టులో ప్రైవేటు ఆసుపత్రుల ధరల నియంత్రణపై విచారణ జరుగుతున్న తరుణంలో, పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఒక దిశానిర్దేశంలా పనిచేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్ద ప్రైవేటు ఆసుపత్రులు తమ లాభాల్లో కొంత భాగాన్ని పేద రోగులకు ఉచిత వైద్యం కోసం ఖర్చు చేయాలని కమిటీ సూచించడం, వైద్య రంగాన్ని సామాన్యుడికి మరింత దగ్గర చేసే దిశగా వేసిన అడుగుగా భావిస్తున్నారు. ఇక పార్లమెంటరీ కమిటీ సూచనలను ప్రభుత్వం యథాతథంగా ఆమోదిస్తుందా? లేక ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చలకు మొగ్గుచూపుతుందా? అనేది చూడాల్సివుందని అంటున్నారు. పార్లమెంటరీ కమిటీ సూచనలను అమలు చేసేలా అడుగులు వేస్తే దేశంలో వైద్య సేవల రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లుగానే పరిశీలకులు భావిస్తున్నారు.

# జయము కలిగేనా.. జయమంగళా ..?



వైసీపీ తరఫున మండలిలో సీటు దక్కించుకుని.. తర్వాత ఆ పార్టీకి దూరమైన నాయకుడు జయమంగళ వెంకటరమణ. బీసీ సామాజికవ ర్గానికి చెందిన ఆయన.. టీడీపీతోనే రాజకీయాలు ప్రారంభించారు. గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కైకలూరు నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్నారు. తర్వాత.. ఈ సీటును బీజేపీకి ఇచ్చేయడంతో ఆయన మౌనంగా ఉన్నారు. ఇలా.. 2014, 2024 ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ నుంచి విజయం దక్కించుకుంది. అయితే.. 2019లో జయమంగళకు పార్టీ టికెట్ ఇచ్చినా.. ఆయన పరాజయం పాలయ్యారు.

కైకలూరు నియోజకవర్గంలో 2004 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక్కసారి (2009) టీడీపీ విజయం దక్కించుకుంది. అయితే.. అది కూడా జయమంగళతోనే సాధ్యమైంది. కానీ, బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకున్న ప్రతి సారీ.. జయమంగళకు శ్రీముఖమే దక్కుతోంది. అందుకే 2014, 2024లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈ క్రమంలోనే వైసీపీ బాటపట్టారు. అక్కడ బీసీ కోటాలో మండలి స్థానం దక్కించుకున్నారు. కానీ, ఎన్నికల్లో వైసీపీ పరాజయం పాలవడం.. టీడీపీలోని పాత మిత్రులు ఆహ్వానించడంతో జయమంగళ సైకిల్ ఎక్కేశారు.ఇక, వచ్చే ఎన్నికల నాటికి కైకలూరు నియోజకవర్గం రాజకీయాలు మారనున్నాయి. ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు.. కామినేని శ్రీనివాసరావు రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించారు. ద

వచ్చే ఎన్నిక లలో తాను పోటీ చేసేది లేదన్నారు. దీంతో తాజాగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. త్వరలోనే కైకలూరు నియోజకవర్గానికి ఇంచార్జ్‌ను నియమిస్తామన్నారు. ఈ పరిణామంతో జయమంగళకు జయం కలుగుతుందని.. ఆయనను ఇంచార్జ్ గా నియమించే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జయమంగళకు అనుకూలంగా ఫ్లెక్సీలు కూడావెలిశాయి.

కట్ చేస్తే.. కామినేని వ్యూహం మరోలా ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తనకు కలిసి వచ్చిన నియోజక వర్గం కావడం.. రెండు సార్లు పోటీ చేస్తే.. రెండు సార్లూ ఇక్కడ విజయం దక్కించుకున్న క్రమంలో తన లెగసీని కాపాడుకునేందుకు.. ఆయన బీజేపీకి ఇక్కడ స్థానాన్ని పదిలం చేసేలా ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. అంటే.. తన బదులుగా ఆయనే బీజేపీకి చెందిన బలమైన నేతను ప్రతిపాదించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇదే జరిగితే.. మరోసారి బీజేపీకి ఇక్కడ టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఒక్క సమస్య నుంచి జయమంగళ బయట పడితే.. ఆటోమేటిక్‌గా ఆయనకు బాధ్యతలు దక్కుతాయని చెబుతున్నారు.

# మండలి డిప్యూటీ చైర్మన్, వైసీపీ సిద్ధం.. కూటమి నిర్ణయంపైనే ఉత్కంఠ!



శాసనమండలి సమావేశాల వేళ డిప్యూటీ చైర్మన్ ఎన్నికపై విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుతం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. గత నెల 27వ తేదీవరకు వైసీపీకి చెందిన జకియా ఖానమ్ డిప్యూటీ చైర్ పర్సనుగా ఉండేవారు. ఆమె పదవీకాలం పూర్తికావడంతో రిటైర్ అయ్యారు. దీంతో మండలి ఉపాధ్యక్ష పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో ఈ సమావేశాల్లో డిప్యూటీ చైర్ పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అవుతుందా? అనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వ నిర్ణయంతో సంబంధం లేకుండా వైసీపీ తమ పార్టీ తరఫున డిప్యూటీ చైర్ పర్సన్ గా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేరును ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వ నిర్ణయం ఉత్కంఠ రేపుతోంది. ప్రభుత్వం వైసీపీ నిర్ణయించిన తూమాటి మాధవరావును డిప్యూటీ చైర్ పర్సన్ గా ఎంపిక చేయడానికి సిద్ధమవుతుందా? లేదా? అనే ప్రశ్న హాట్ టాపిక్ అవుతోంది.శాసనమండలిలో సభ్యులు బలాబలాల ఆధారంగా ఎన్నిక నిర్వహిస్తే వైసీపీ ప్రతిపాదించిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు డిప్యూటీ చైర్ పర్సన్ గా ఎంపిక అవడం ఖాయమే అంటున్నారు. ఎందుకంటే 58 మంది సభ్యులు ఉన్న శాసనమండలిలో ఇప్పటికీ వైసీపీకే పూర్తి మెజార్టీ ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం సభలో వైసీపీకి అధికారికంగా 33 మంది సభ్యులు ఉన్నారు. ఇక అధికార కూటమికి 13 మంది సభ్యులు ఉండగా, ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల వారు ఏడుగురు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం ఏడు ఖాళీలు ఉన్నాయి. ఈ సంఖ్యల ఆధారంగా వైసీపీ తన అభ్యర్థిని గెలుపించుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే, వైసీపీ సభ్యుల్లో ఐదుగురు ఇప్పటికే రాజీనామాలు ప్రకటించారు. వీరు అధికార కూటమి పార్టీలలో చేరిపోయారు. అయితే వీరి రాజీనామాలను ఇప్పటివరకు మండలి అధ్యక్షుడు మోషేన్ రాజు ఆమోదించలేదు. దీంతో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ, జనసేనలో చేరిన సభ్యుల నిర్ణయం ఉత్కంఠ రేపుతోంది. పార్టీ సూచించిన అభ్యర్థికి కాకుండా వీరు తమ ఆత్మప్రబోధం మేరకు ఓటు వేస్తారా? అన్న చర్చ జరుగుతోంది. అయితే పార్టీ తరఫున ఎన్నికైన సభ్యులకు ఇలా సొంత నిర్ణయం తీసుకునే వీలు లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ విప్ జారీ చేస్తే పార్టీ సూచించిన అభ్యర్థికే ఓటు వేయాల్సివుంటుందని అంటున్నారు. మరోవైపు ఈ చర్చలకు తెరదించేలా ప్రభుత్వం నిర్ణయం ఉండే అవకాశం ఉందని అంటున్నారు. సభలో బలం లేనందున ఈ సమావేశాల్లో మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించే పరిస్థితి ఉండకపోవచ్చునని పరిశీలకులు అనుమానిస్తున్నారు. వైసీపీ నేతకు పదవి కట్టబెట్టేలా ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకుంటుందని ప్రశ్నిస్తున్నారు. మరో ఏడాది ఆగితే సభలో అధికార పక్షానికి బలం చేకూరే అవకాశం ఉందని, అందువల్ల ప్రస్తుతం ఖాళీ అయిన డిప్యూటీ చైర్మన్ పదవిని వెనువెంటనే భర్తీ చేసేలా నిర్ణయం తీసుకోకపోవచ్చునని అంటున్నారు. అయితే మండలి చైర్మనుగా వైసీపీకి చెందిన మోషేన్ రాజు ఉండటం వల్ల డిప్యూటీ చైర్ పర్సన్ ఎన్నికపై ఆయన నిర్ణయమూ కీలకంగానే చెబుతున్నారు. దీంతో వైసీపీ రెడీ అయినప్పటికి మండలి డిప్యూటీ చైర్ పర్సన్ ఎన్నిక ఉంటుందా? ఉండదా? అనేది సందేహాలు మాత్రం ఎక్కువగానే ఉన్నాయని చెబుతున్నారు.

# దుర్భర గాజా..!

గత ఏడాది అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ, గాజాపై ఇజ్రాయెల్ దాడులకు, విధ్వంసానికి ముగింపని ప్రపంచం ఆశించింది. కానీ వాస్తవం పూర్తి భిన్నం. కాల్పుల విరమణ అమలు నుంచి ఇప్పటికే దాదాపు 1,300 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో అంతమొందారు. గాజా పట్టీలో దాదాపు 70 శాతం మట్టి ఇప్పటికీ ఇజ్రాయెల్ నియంత్రణలోనే ఉంది. రెండు మిలియన్ల జనాభాలో అత్యధికులు శిబిరాల్లో బతుకీడుస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు మూతపడ్డాయి. సాయం పరిమితమైంది, పునర్నిర్మాణాన్ని ఇజ్రాయెల్ తుణీకరిస్తూనే ఉంది. ముందుగా హమాస్ నిరాయుధీకరణ జరగాలన్నది దాని పట్టుదల. అయితే, హమాస్.. దశలవారీగా ఆయుధాలు అప్పగించి, పాలస్తీనా సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి, ఇజ్రాయెల్ క్రమంగా వైదొలిగేలా ట్రంప్ నేతృత్వంలోని 'బోర్డ్ ఆఫ్ పీస్' ప్రతిపాదించిన 15-అంశాల ప్రణాళికను అంగీకరించినా.. -ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పూర్తిగా తిరస్కరించారు. ఆగస్టు 9న జరిగిన కేబినెట్ సమావేశంలో "ఇజ్రాయెల్ 15 అంశాల పత్రాన్ని తిరస్కరిస్తోంది" అని స్పష్టం చేసిన నెతన్యాహూ, హమాస్ "భారీ ఆయుధాలు, తేలికపాటి ఆయుధాలు, మొత్తం అన్ని ఆయుధాలను" వదులుకునే వరకూ ఉపసంహరణ ఉండదని తేల్చిచెప్పారు. అమెరికాతో ఈ అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని, అమెరికా సూచనల్లో కొన్ని తమకు ఆమోదయోగ్యమైనవి, కొన్ని కావని పేర్కొంటూ, "అత్యంత సన్నిహిత మిత్రుల ముందు కూడా అవసరమైతే మేం మా వైఖరిపై స్థిరంగా నిలబడగలం" అని స్పష్టం చేశారు. హమాస్ నిరాయుధీకరణ, గాజా సంపూర్ణ స్వాధీనమే ఇజ్రాయెల్ అసలు లక్ష్యం. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకూ 73,300కు పైగా పాలస్తీనియన్లు మరణించడం.. గాజా దారుణ దుస్థితిని స్పష్టం చేస్తోంది.

అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో దక్షిణాఫ్రికా దాఖలు చేసిన మారణహోమం కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. బ్రెజిల్, ఐర్లాండ్, టర్కీ, స్పెయిన్, మెక్సికో సహా పలు దేశాలు ఈ కేసుకు మద్దతుగా చేరాయి. ఇజ్రాయెల్ న్యాయవాద బృందాలు పదేపదే విచారణను వాయిదా వేయించడంలో సఫలమయ్యాయి. వచ్చే ఏడాది వరకు మరో వాయిదా పడే అవకాశముంది. ఇక అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) 2024 నవంబర్‌లోనే నెతన్యాహూతోపాటు మాజీ రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌పై యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాల ఆరోపణలతో అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ వారెంటు ప్రకారం, ఐసీసీలో సభ్యదేశాలైన 124 దేశాల్లో దేనిలో అడుగుపెట్టినా నెతన్యాహూను అరెస్టు చేయాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుంది. టర్కీ సైతం స్వతంత్రంగా నెతన్యాహూతోపాటు 37మంది ఇజ్రాయెల్ అధికారులపై మారణహోమం ఆరోపణలతో అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఇంతటి తీవ్రమైన అంతర్జాతీయ న్యాయపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నా, దేశీయంగా అవినీతి కేసులో కూడా నెతన్యాహూ విచారణను ఎదుర్కొంటున్నారు. హమాస్‌ను సంపూర్ణంగా నిర్మూలిస్తానని హామీ ఇస్తూ, జాతీయవాద మితవాద వర్గాల మద్దతుతో అధికారంలో కొనసాగాలన్నదే ఆయన వ్యూహం. అక్టోబర్ 27న జరగనున్న ఎన్నికల్లో తన సంకీర్ణ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయే ప్రమాదముందని సర్వేలు చెబుతున్న తరుణంలో, ఉపసంహరణపై ఏ చిన్న రాయితీ ఇచ్చినా రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నెతన్యాహూ భావిస్తున్నారు. అందుకే "నేను ప్రధానిగా ఉన్నంతకాలం, గాజాలోగానీ వెస్ట్‌బ్యాంక్‌లో గానీ పాలస్తీనా రాజ్యం ఏర్పడదు" అని ఆయన మరోసారి కరాఖండీగా స్పష్టం చేశారు. మరోవైపు, హమాస్‌వైపు నుంచి చూస్తే, తన వద్ద మిగిలిన సాధనాలు తక్కువగా ఉన్న తరుణంలో నిరాయుధీకరణ అనివార్యమే అయినా, దానికి ఇజ్రాయెల్ సంపూర్ణ ఉపసంహరణ, హింసాకాండ నిలిపివేత సమాంతరంగా జరగాలన్నది దాని డిమాండ్. భారీ ఆయుధాలను వదులుకోవడం ప్రక్రియలో తర్వాతి దశలో మాత్రమే జరుగుతుందని, అది కూడా పాలస్తీనా రాజ్య స్థాపనకు హామీ లభిస్తేనే సాధ్యమని హమాస్ షరతు విధించింది. అయితే, బోర్డ్ ఆఫ్ పీస్ ఇప్పటికే నెతన్యాహూ వాదననే సమర్థిస్తూ, హమాస్ ఆయుధాలు పూర్తిగా నిర్వీర్యమైన తర్వాతే ఇజ్రాయెల్ 'ఎల్లో లైన్' దాటి వైదొలుగుతుందని ఆగస్టు 3న ప్రకటించడం గమనార్హం. దీంతో మధ్యవర్తులు నెలల తరబడి కష్టపడి రూపొందించిన ఈ శాంతి ప్రణాళిక మళ్లీ ప్రతిష్టంభనలో పడింది.

ఫిబ్రవరి 28న ట్రంప్, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు లక్ష్యంగా ప్రారంభించిన యుద్ధం ఒక విపత్తుగా మారి, పలు దేశాలను ప్రభావితం చేసిన ఇంధన సంక్షోభానికి దారితీసింది. హర్మూజ్ జలసంధి దాదాపు స్తంభించిపోవడంతో, అమెరికాలో పెట్రోల్, ఎరువుల ధరలు పెరిగి, స్వదేశీ ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపడం మొదలైంది. దీంతో పశ్చిమాసియాలో ఏదోక ముఖరక్షణ పరిష్కారాన్ని కనుగొనాలని ట్రంప్ ఆరాటపడుతున్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్‌పై సానుభూతి క్రమంగా తగ్గుతుండటం కూడా బోర్డ్ ఆఫ్ పీస్ ప్రతిపాదన వెనుక ఉన్న మరో కారణం. అయితే, పాలస్తీనియన్లకు ప్రాతినిధ్యం లేని బోర్డు, ప్రైవేటీకరించిన మౌలిక సదుపాయాలు, స్వేచ్ఛా వాణిజ్య మండలిగా 'కొత్త గాజా' రూపొందించాలన్న హాస్యాస్పదమైన దార్శనికత -ఇవి యుద్ధానంతర పచ్చి లాభార్జన ప్రయత్నంలా కనిపిస్తున్నా, ఈ 15-అంశాల ప్రతిపాదననే గాజాలో నలిగిపోతున్న ప్రజలు స్వాగతించే అవకాశం ఉంది. హిల్లరీ క్లింటన్ వంటి డెమోక్రాటిక్ నేతలు సైతం విమర్శకుల నుంచి విడిపోయి, ఈ ప్రణాళికను "ఇప్పుడున్న ఏకైక మార్గం"గా అభివర్ణించడం గమనార్హం. హమాస్ వద్ద చర్చల్లో బేరమాడేందుకు మిగిలింది తక్కువే అయినందున, నిరాయుధీకరణ దానికి తప్పనిసరి అవసరం. కానీ దానికి ప్రతిగా ఇజ్రాయెల్ ఉపసంహరణ కూడా జరగాలన్న న్యాయమైన డిమాండ్‌ను విస్మరించలేం. ఇజ్రాయెల్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి, నిజమైన ఉపసంహరణను సాధించడానికి అమెరికా ప్రయత్నించొచ్చు. కానీ నెతన్యాహూ రాజకీయ మనుగడ కోసం ఆయన అనుసరిస్తున్న వ్యూహం, రెండేళ్లుగా న్యాయస్థానాల విచారణలను ఏదోవిధంగా వాయిదా వేయిస్తూ కాలయాపన చేస్తున్న ధోరణి చూస్తుంటే, గాజా ప్రజలకు నిజమైన శాంతి ఇప్పట్లో దక్కే అవకాశం కనిపించడం లేదు. అంతర్జాతీయ సమాజం మాటలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట చర్యలు తీసుకోకపోతే, ఈ మారణహోమం మరింత సుదీర్ఘంగా కొనసాగే ప్రమాదం ఉంది.

**పనికొచ్చే పలుకు**




## మలుపే కదా.. మనసైన జీవితం

***Comparison is the thief of joy.***

ఇది థియోడర్ రూజ్‌వెల్ట్ మాట. సింపుల్‌గా చెప్పాలంటే.. 'పోలిక అనేది ఆనందాన్ని దొంగిలించే దొంగ' అని! పుట్టినప్పటి నుంచి చనిపోయేదాకా జీవితం ఒక సరళరేఖలా సాగుతుందని మనం చిన్నప్పటి నుంచే ఒక భ్రమలో పెరుగుతాం. బడిలో చేరడం, పరీక్షలు రాయడం, డిగ్రీ పొందడం, ఉద్యోగం సంపాదించడం, పెళ్లి చేసుకోవడం, స్థిరపడడం -ఈ క్రమాన్ని సమాజం మనకు ఒక 'విజయ సూత్రం'లా బోధిస్తుంది. ఈ క్రమంలో ఏ ఒక్క మెట్టు తడబడినా, ఏ ఒక్క అడుగు ఆలస్యమైనా, జీవితం విఫలమైనట్టు భావించే ధోరణి మనలో పాతుకుపోతుంది. కానీ నిజం చెప్పాలంటే, ఈ ప్రపంచంలో ఏ ఒక్క గొప్ప విజయగాథ కూడా ఇలా సూటిగా, నిటారుగా సాగిన దాఖలా లేదు.

ప్రకృతిని గమనించండి. -నదులు ఎప్పుడూ సూటిగా ప్రవహించవు. కొండలు, రాళ్లు, లోయలను చుట్టుకుంటూ, వంపులు తిరుగుతూ, కొన్నిచోట్ల వేగంగా, మరికొన్నిచోట్ల నెమ్మదిగా సాగుతూ చివరికి సముద్రంలో కలుస్తాయి. మనిషి జీవితం కూడా అంతే. కొందరు 20 ఏళ్లకే విజయం సాధిస్తే, మరికొందరికి 40 ఏళ్లు పడుతుంది. కొందరు మొదటి ప్రయత్నంలోనే గెలుస్తే, మరికొందరు పదిసార్లు ఓడి పదకొండోసారి నిలబడతారు. ఒకరి వేగాన్ని, ఒకరి బాటను మరొకరితో పోల్చడం అన్యాయమే కాదు, అనవసరమైన మానసిక క్షోభ కూడా. సామాజిక మాధ్యమాల యుగంలో మనం ప్రతిక్షణం ఇతరుల విజయాలను చూస్తూ, మన సొంత ప్రయాణాన్ని తక్కువ చేసి చూసుకునే ప్రమాదంలో పడుతున్నాం. స్నేహితుడు త్వరగా ఉద్యోగం సంపాదిస్తే, తోబుట్టువు ముందుగా పెళ్లి చేసుకుంటే, సహోద్యోగి వేగంగా పదోన్నతి పొందితే -వీటన్నింటినీ చూసి మనం వెనుకబడిపోయామనే భావనలో కుంగిపోతాం. కానీ ఇది తప్పుడు కొలమానం. ప్రతి మనిషి జీవితం ఒక ప్రత్యేకమైన అధ్యాయం. దాన్ని మరొకరి అధ్యాయంతో పోల్చి చదవలేం.


"వంకరైనా గమ్యం ఒక్కటే" అని పెద్దలు చెప్పే మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి. నది ఎన్ని మలుపులు తిరిగినా చివరికి సముద్రాన్నే చేరుతుంది. అలాగే, మన జీవిత మార్గం ఎన్ని మలుపులు తిరిగినా, ఎంత ఆలస్యమైనా, మనం చేరాల్సిన గమ్యాన్ని చేరుకోగలం. ఒక్క షరతుతో, మన ప్రయాణాన్ని మధ్యలో వదిలేయకుండా ఉంటే చాలు. ఈ ఆలోచననే పాశ్చాత్య రచయిత రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఇలా చెప్పాడు: Do not go where the path may lead, go instead where there is no path and leave a trail. అంటే, ఇతరులు వేసిన బాటలో నడవడంకంటే, మీ సొంత బాటను మీరే సృష్టించుకోవడంలోనే నిజమైన సాఫల్యం ఉంటుంది.

కాబట్టి, రేపటి నుంచి ఇతరుల జీవిత వేగంతో మీ జీవితాన్ని కొలవడం మానేయండి. మీ మలుపులను, ఆలస్యాలను, తడబాట్లను వైఫల్యాలుగా కాకుండా, మీ ప్రత్యేకమైన ప్రయాణంలో భాగంగా స్వీకరించండి. ప్రతి ఆలస్యం వెనుక ఒక పాఠం ఉంటుంది. ప్రతి మలుపు వెనుక ఒక కొత్త అవకాశం దాగి ఉంటుంది. మీ వేగం మీది, మీ దారి మీది. -దాన్ని గౌరవించడం నేర్చుకోండి. అప్పుడే నిజమైన మనశ్శాంతి, నిజమైన విజయం మీ సొంతమవుతాయి.

మీ ప్రయాణం ఎంత వంకరైనా, ఎంత ఆలస్యమైనా -అది మీదే. అందులోనే మీ అసలైన అందం దాగుంది. ఇతరుల వేగంతో పరుగెత్తడం మానేసి, మీ లయలో మీరు నడవండి. మిమ్మల్ని వెతుక్కుంటూ గమ్యం అదే మీవైపు వస్తుంది.

# ఇదీ.. నవ నగర జవసత్వం!

**రాజధాని అమరావతి నిర్మాణంలో ఆగస్టు 13న చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ, స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ టవర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. విజయవాడ నుంచి రాజధానికి నిరంతరాయ అనుసంధానం కల్పించే ఈ 21.77 కిలోమీటర్ల రహదారి, ఇరుకైన కరకట్ట రోడ్డుపై ఆధారపడిన వేలాది మందికి శాశ్వత ఊరట కల్పించనుంది. మౌలిక వసతులతోపాటు, పర్యాటక కేంద్రంగానూ ఈ కారిడార్‌ను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2050 నాటికి 35 బిలియన్ డాలర్ల జీడీపీ, 35 లక్షల జనాభాతో ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలన్న అమరావతి కలకు ఈ రహదారి పునాదిగా నిలవనుంది.**




రాజధాని అమరావతి నిర్మాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ, స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ టవర్లను సీఎం చంద్రబాబు నేడు (ఆగస్టు 13న) ప్రారంభిస్తున్నారు. ఇది -రాజధాని నగర నిర్మాణ ప్రస్థానానికి కీలక మలుపు కానుంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని కొత్త రాజధానిగా ప్రకటించినప్పటి నుంచి, ఈ ప్రాజెక్టు అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. బ్రిటన్‌కు చెందిన ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ రూపొందించిన అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం, 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విజయవాడ-గుంటూరు నగరాల మధ్య నగరాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, 2019-2024 మధ్య కాలంలో వైసీపీ మూడు రాజధానుల ప్రతిపాదనతో ప్రాజెక్టు నిర్మాణం స్తంభించింది. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం రూ.65 వేల కోట్లతో పునర్నిర్మాణ పనులు వేగవంతం చేసింది. -ఏప్రిల్ 2న ఏపీకి ఏకైక అధికారిక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం కీలక పరిణామం. ప్రస్తుతం అమరావతి పరిధిలో రూ.57,821 కోట్ల విలువైన నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రజా రాజధానికి జవసత్వాన్నిచ్చే సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేయడం.. అమరావతి నిర్మాణంలో సర్కారు చూపుతున్న చిత్తశుద్ధి, వేగానికి నిదర్శనంగా కాకపోదు!

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం వెనుక ఉన్న అసలైన ఉద్దేశం -రాజధాని నగరానికి, పరిసర ప్రాంతాలకు నిరంతరాయ, వేగవంతమైన అనుసంధానత కల్పించడం. ప్రస్తుతం విజయవాడ నుంచి అమరావతి సచివాలయం, హైకోర్టుకు వెళ్లే వేలాది మంది ఇరుకైన కరకట్ట రహదారిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ ఆంక్షలు, రద్దీ కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్టే. మొత్తం 21.77 కిలోమీటర్ల పొడవైన రహదారి, రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన 'ఎన్' సిరీస్ రోడ్లను అనుసంధానించే వెన్నెముక.

దొండపాడు నుంచి మొదలై రాయపూడి, వేంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా సాగి, మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి-16లో కలుస్తుంది. తొలి రెండు దశల్లో 9 లైన్ల రహదారిగా, మధ్యలో ప్రత్యేక బీఆర్‌టీఎస్ కారిడార్‌తో దీన్ని నిర్మించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ, భూగర్భ మంచినీటి పైప్‌లైన్లు, గ్యాస్ నెట్‌వర్క్, విద్యుత్ లైన్లు, సివరేజ్ వ్యవస్థ, ఐసీటీ కేబుళ్లతోపాటు ప్రత్యేక సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌వేలను ఏర్పాటు చేశారు. ఇది వాహనాల రాకపోకలకే కాకుండా, భవిష్యత్తులో నగర విస్తరణకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్న దూరదృష్టిని ప్రతిబింబిస్తుంది. అదే రోజు ప్రారంభమయ్యే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లలో మొత్తం 207 అత్యాధునిక ఫ్లాట్లను ప్రజాప్రతినిధులకు అందించడం ద్వారా, పరిపాలనా వ్యవస్థను రాజధానిలోకి పూర్తిస్థాయిలో తరలించే ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఈనెల 17నుంచి ప్రారంభమయ్యే శాసనసభ వర్షాకాల సమావేశాల నాటికి ఈ ఫ్లాట్ల కేటాయింపు జరిగే అవకాశం ఉండటం, రాజధానిలో పరిపాలన కేంద్రీకృతం కావడానికి మరో అడుగు ముందుకు పడినట్టే!

ఈ ప్రాజెక్టు వెనుక ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యతలను నిశితంగా పరిశీలిస్తే, కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా, ఆర్థిక, పర్యాటక కోణాల్లోనూ విస్తృత లక్ష్యాలు కనిపిస్తాయి. ఆమ్‌స్టర్‌డామ్, సింగపూర్, టోక్యోవంటి అంతర్జాతీయ నగరాల స్ఫూర్తితో అమరావతిని ప్రపంచస్థాయి, సమ్మిళిత, ఆధునిక పట్టణ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2050నాటికి ఈ నగరం 35 బిలియన్ డాలర్ల జీడీపీతో, 35 లక్షలమందికి నివాసంగా, 15 లక్షల ఉద్యోగాలను సృష్టించే ఆర్థిక కేంద్రంగా ఎదగాలని అంచనా వేస్తున్నారు. ఈ బృహత్తర లక్ష్యాన్ని సాధించాలంటే, ముందుగా పటిష్టమైన అనుసంధాన వ్యవస్థ ఏర్పడాలి. అందుకే సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఇంత ప్రాధాన్యం. ఈ కారిడార్ వెంబడి ఉండవల్లి, పెనుమాక, మందడం వంటి ప్రాంతాల్లో భూముల విలువ గణనీయంగా పెరగనుంది. ఐటీ కంపెనీలు, వాణిజ్య సముదాయాలు ఇక్కడ కేంద్రీకృతమయ్యే ఛాన్స్ ఉంది. కేవలం మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగానూ తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ప్రభుత్వం అడుగులేస్తోంది. కృష్ణా నది, కొండవీటి వాగు అందాల ఆస్వాదనకు ప్రత్యేక వ్యూ పాయింట్లు, పర్యావరణహిత సైక్లింగ్-వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేయడం ఇందులో భాగమే. ప్రపంచ ప్రఖ్యాత బకింగ్‌హామ్ కెనాల్‌పై 110 మీటర్ల పొడవుతో, కొండవీటి వాగుపై 280 మీటర్ల పొడవుతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలు, రాజధానికి కొత్త గేట్‌వే. వరద ముప్పు రక్షణ ఏర్పాట్లూ ఇందులోనే పొందుపర్చారు. ఇక మూడో దశలో ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మించనున్న 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పూర్తయితే, ఈ రహదారి ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌గా జాతీయ రహదారి-16తో నేరుగా అనుసంధానమవుతుంది. సో, సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవం రహదారి ప్రారంభమే కాదు -రాజధాని నగరం భవిష్యత్తు వైపు వేస్తున్న దృఢమైన అడుగు. మౌలిక సదుపాయాల కల్పనలో వేగం, పరిపాలనా వికేంద్రీకరణలో స్పష్టత, ఆర్థికాభివృద్ధిలో దూరదృష్టి -ఈ మూడింటినీ మేళవించి, అమరావతిని నిజమైన అర్థంలో ప్రజల రాజధానిగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ ప్రాజెక్టు నిలువెత్తు నిదర్శనం! ■



పిల్లాడి కేరింతలు మొదలైన క్షణం నుంచి, మన జీవితం కూడా కొత్త లయలో నడవాలి. అంతేగానీ ఆగిపోకూడదు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలు పుట్టిన తర్వాత బయటకు వెళ్లడం, వ్యాయామం చేయడం, తమ కోసం సమయం కేటాయించడం లాంటివి పూర్తిగా వదిలేస్తుంటారు. ఇది పిల్లల వల్ల వచ్చే సమస్య కాదు. పెరిగిన బాధ్యతలకు తగ్గట్టుగా మన ఓర్పు, సమయ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోకపోవడం వల్ల వచ్చే ఇబ్బంది మాత్రమే. చిన్న చిన్న ప్రణాళికలతో మీ సామర్థ్యాన్ని పెంచుకుంటే, పిల్లలతో కలిసి మరింత ప్రశాంతంగా, పరిపూర్ణంగా జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## అర టన్ను తీపి కల!



స్పెయిన్‌కు చెందిన ప్రముఖ పేస్ట్రీ చెఫ్ మార్క్ సువారెజ్ ఇటీవల సృష్టించిన వెడ్డింగ్ కేక్ చూసి అందరూ నోరెళ్లబెట్టారు. 3.5 మీటర్ల ఎత్తు, 1.8 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ కళాఖండం, కేక్‌లాకాకుండా మ్యూజియంలో ఉంచే శిల్పంలా కనిపిస్తుంది. సౌదీ రాజ కుటుంబం నిర్వహించిన ఒక వివాహం కోసం దీన్ని ప్రత్యేకంగా తయారుచేశారు. కాన్సెప్ట్ రూపొందించడానికే ఒకటిన్నర నెలపట్టగా, పూర్తి చేయడానికి నాలుగు నెలలు, మొత్తం 1,800 గంటలు శ్రమించారు. సాధారణంగా ఒంటరిగా పనిచేసే సువారెజ్, ఈసారి పని భారీగా ఉండటంతో స్నేహితులు, వారి కుటుంబాలను సైతం రంగంలోకి దించారు. 33,000 చక్కెర రేకులను తయారుచేసి, రంగులు వేసి, కొమ్మలు, పూలతో అమర్చడమే పెద్ద సవాలైంది. చివరికి ఈ కేక్ బరువు ఏకంగా 500 కిలోలకు చేరింది. విశేషం ఏమిటంటే, ఇందులో కేవలం 0.1 శాతమే అసలైన కేక్, మిగతాదంతా చేతితో మలిచిన షుగర్ పేస్ట్, వైట్ చాక్లెట్టే! పారిస్ ఒపేరా గార్నియర్‌లో జరిగిన ఈ వేడుకలో ఈ కేక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# ఆయుష్షు మూలం మనసులోనే

దీర్ఘాయువు రహస్యం మనసులోనే దాగుందా? 115 ఏళ్ల వయసుతో ప్రపంచంలోనే అతి ఎక్కువకాలం జీవించి ఉన్న మహిళగా రికార్డు సృష్టించిన ఎథెల్ కేటర్‌హ్యామ్ ఇదే సూచిస్తున్నారు. వాదించక పోవటం.. ఎదుటివారు చెప్పింది విన్నా నచ్చింది చేయటమే తన దీర్ఘాయువు సూత్రమన్నది ఆమె నమ్మకం. ఇది మామూలు విషయంగా అనిపించినా ఇందులో ప్రశాంతత, ఆత్మ గౌరవం ధ్వనిస్తుండటం గమనార్హం. భావోద్వేగాల అదుపుతోనే ఇది సాధ్యం. దీనికీ దీర్ఘాయుష్షుకూ సంబంధం ఉంటుండటం మరింత విశేషం.

శారీరకంగా జబ్బులు లేకపోవటమే కాదు. మానసికంగానూ బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు. అప్పుడే చురుకుగా, హాయిగా జీవితాన్ని ఆస్వాదించగలం. కుటుంబ, సామాజిక సంబంధాలతో ఉన్నతిని సాధించగలం. ఇక్కడే భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రోజూ మనకు ఎన్నో భావాలు కలుగుతుంటాయి. అవి అంతటితోనే ఆగిపోవు. ఉద్వేగాలనూ కలిగిస్తాయి. అన్నిసార్లూ ఇవి సానుకూలంగానే ఉండకపోవచ్చు. ప్రతికూల భావోద్వేగాలూ మనసును అతలాకుతలం చేస్తుండొచ్చు. ఉదాహరణకు- పరీక్షలో ఫెయిల్ అయ్యారనుకోండి. లేదూ కోరుకున్న ఉద్యోగం దొరకలేదనుకోండి. మనసంతా విచారంతో నిండిపోతుంది. కొందరు దీన్ని తేలికగా తీసుకోవచ్చు. అంతటితోనే ముగింపు పలకొచ్చు. కొందరు విపరీతంగా స్పందించొచ్చు. నిరాశా నిస్పృహలకు లోనుకావొచ్చు. ఇలాంటి ప్రతికూల భావాలను, వీటికి స్పందించే తీరును సమన్వయం చేసుకోవటమే భావోద్వేగ నైపుణ్యం. అంటే భావాలను అర్థం చేసుకొని, వాటిని సమర్థంగా అదుపులో ఉంచుకోవటమన్నమాట. స్వీయ చైతన్యం కలిగుండటం, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యమూ దీనిలోని భాగమే. ఇది మానసిక ఆరోగ్యం మీదే కాదు, శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం చూపుతుంది.



**ఆయుర్దాయానికి దన్ను ఇలా..**

మనం ఆయుష్షును చాలావరకూ శారీరక ఆరోగ్యంతోనే ముడిపెట్టి చూస్తుంటాం. కానీ మానసిక ఆరోగ్యమూ గణనీయ పాత్ర పోషిస్తుంది. మానసికంగా బాగున్నవారు మరింత ఎక్కువ కాలం.. హాయిగా జీవించే అవకాశమున్నట్టు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇందులో భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం అడుగడుగునా సాయం చేస్తుంది. ఇంతకీ ఇదెలా ఆయుష్షును పెంచుతుంది?

**ఒత్తిడి దూరం:** భావోద్వేగాల అదుపుతో కార్టిజోల్ వంటి ఒత్తిడి హార్మోన్ల మోతాదులు, ప్రభావాలు తగ్గుతాయి. ఫలితంగా కుంగుబాటు, ఆందోళన, భయాల వంటివీ తగ్గుముఖం పడతాయి. ఇది గుండె, మెదడు వంటి కీలక అవయవాలకూ మేలు చేస్తుంది. తరచూ కుంగుబాటు వంటి వాటికి గురయ్యేవారికి గుండెపోటు, పక్షవాతం ముప్పులు 6 రెట్లు ఎక్కువ. భావోద్వేగాల అదుపుతో వీటి ముప్పు తగ్గుతుంది. పరోక్షంగా ఆయుర్దాయమూ పెరుగుతుంది.

**రోగనిరోధక బలం:** మానసిక దృఢత్వంతో రోగనిరోధక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. వీరిలో యాంటీబాడీలను తయారుచేసే టి కణాల వంటివి చురుకుగా పనిచేస్తాయి. అందువల్ల బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పు తక్కువ. ఇన్‌ఫెక్షన్లు దాడిచేసినా సమర్థంగా ఎదుర్కోగలుగుతారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు జబ్బుల నుంచి 1.14 రెట్లు ఎక్కువ వేగంగా కోలుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

**వాపు ప్రక్రియ తగ్గుముఖం:** కణ అంతర్గత వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తగ్గటం మరో ముఖ్య విషయం. దీంతో మధుమేహం, అల్జీమర్స్, క్యాన్సర్ల వంటి జబ్బులు వచ్చే అవకాశమూ తగ్గుతుంది.

**జీవనశైలి:** మానసికంగా బాగున్నవారు వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం వంటి మంచి జీవనశైలిని పాటిస్తుంటారు. ఇది మొత్తంగా ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

**సర్దుబాటు సామర్థ్యం:** భావోద్వేగ నైపుణ్యం మూలంగా ఇతరులతో సర్దుకుపోయే స్వభావమూ మెరుగవుతుంది. దీంతో ఇంటా బయటా కలివిడితనం ఇనుమడిస్తుంది. కుటుంబ, స్నేహ సంబంధాలూ పెరుగుతాయి. ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో రాణించటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తారు. ఇవి మరింత మానసిక దృఢత్వానికీ తోడ్పడతాయి. ఇలా ఇదొక సానుకూల వలయంగా ప్రయోజనం కలిగిస్తుందన్నమాట.

**భావోద్వేగ నైపుణ్యాన్ని సాధించేదెలా?**

**అవగాహన:** భావోద్వేగాలను గుర్తించటం, అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. అప్పుడే వీటిని అదుపులో ఉంచుకోవటానికి, పైచేయి సాధించటానికి మార్గం సుగమమవుతుంది. ఉదాహరణకు- ఇంతకుముందు ఎవరి మీదైనా కోపాన్ని ప్రదర్శించినప్పుడు ఎలాంటి అనుభవం ఎదురైంది? వాళ్లు ఎలా బాధపడ్డారు? తమకు ఎంత క్షోభ కలిగింది? అనేవి అవగతమైతే మున్ముందు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవటానికి వీలుంటుంది.

**దయ, కరుణ:** మన చేతుల్లో లేనివాటికి చింతిస్తే ప్రయోజనం లేదు. దీంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కాబట్టి తమను తాము దయతో చూసుకోవటం, బలాలు, బలహీనతలను గుర్తించటం.. తమను తాము క్షమించుకోవటం సాధన చేయాలి.

**అన్యోన్య అనుబంధాలు:** ఇవి ఒడుదొడుకుల్లో తమకు ఒకరు తోడున్నారనే భరోసా ఇస్తాయి. ధైర్యంగా ముందుకు సాగేలా ప్రోత్సహిస్తాయి. మానసిక సమతుల్యత చేకూరుస్తాయి. భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యమూ అబ్బుతుంది.

**లక్ష్య సాధన:** జీవితంలో ఏదో ఒక ఆశయం, లక్ష్యం పెట్టుకోవటం.. దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంటే తృప్తి కలుగుతుంది. పెద్ద పెద్ద లక్ష్యాలే కానక్కర్లేదు. చిన్నవైనా సరే. వీటిని క్రమంగా సాధిస్తుంటే ఆత్మ విశ్వాసం, నిబ్బరం ఇనుమడిస్తాయి.

**ధ్యానం:** గాఢంగా, లయబద్ధంగా శ్వాస తీసుకుంటూ చేసే ప్రాణాయామం, మనసు మీద దృష్టిని నిలిపే ధ్యానం ఎంతో మేలు చేస్తాయి. ఇవి ప్రతికూల ఆలోచనల నుంచి మనసును మళ్లించి సానుకూల భావాలు పెంపొందేలా చేస్తాయి.

**డైరీ రాయటం:** తాము ఎదుర్కొన్న ఘటనలను డైరీలో రాసుకుంటే ఎప్పుడెలా ప్రవర్తించామో అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. అసమంజసంగా స్పందించటాన్ని తెలుసుకోవటానికి, మున్ముందు అలా ప్రవర్తించకుండా ఉండటానికి దోహదం చేస్తుంది.

**సృజనాత్మక కళలు:** సంగీతం, చిత్ర లేఖనం, చేత్తో బొమ్మలు చేయటం వంటి సృజనాత్మక కళలు మనసులోని భావాలను బయటకు వెల్లడించటానికి, భారం తగ్గటానికి తోడ్పడతాయి. ప్రతికూల భావోద్వేగాలు క్రమంగా సానుకూలంగా మారతాయి.

**సమయ పాలన:** పనులను ఆయా వేళల ప్రకారం చేయటం, సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం మరో మంచి పద్ధతి. ఇది అనవసరంగా ఆదుర్దా పడకుండా, భావోద్వేగాలు గతి తప్పకుండా చూసుకోవటానికి తోడ్పడుతుంది.

**ఓపెన్ మైండ్:** అవతలివారి కోణాన్ని వినటం వల్ల అభిప్రాయ భేదాలను గుర్తించటానికి వీలవుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పకుండా చూసుకోవచ్చు. ఎదుటి వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వటం ద్వారా వ్యక్తిగత దూషణలకు దిగకుండా చూసుకోవచ్చు.

# ఆహార నిద్ర



నిద్రలేమి రకరకాల జబ్బులకు దారితీస్తుంది. అందువల్ల కంటి నిండా నిద్ర పట్టేలా చూసుకోవటం తప్పనిసరి. మరి మంచి నిద్ర కావాలంటే? ఆహార అలవాట్లను మార్చుకొని చూడండి. అవును, మన ఆహార అలవాట్లు.. తినే తిండిలోని పోషకాలు, కొవ్వులు, చక్కెర, పీచు వంటివన్నీ నిద్ర తీరుతెన్నుల్లో పాలు పంచుకుంటాయి మరి. కొందరు పడుకోగానే వెంటనే నిద్రలోకి జారుకుంటారు. కొందరికి ఎంత ప్రయత్నించినా ఒక పట్టాన నిద్ర పట్టదు. కొందరు చిన్న అలికిడికే మేల్కొంటే మరికొందరు పెద్ద చప్పుళ్లయినా గాఢంగా నిద్రపోతుంటారు. నిద్ర విషయంలో రకరకాల అంశాలు పాలు పంచుకుంటాయి. వీటిల్లో ఆహార అలవాట్లూ ఒకటి. పడుకునే ముందు కడుపు నిండా తినటం వంటివి నిద్రకు భంగం కలిగిస్తే.. అరటిపండు తింటే కమ్మటి నిద్రకు దోహదం చేస్తుంది. అలాంటి కొన్ని జాగ్రత్తలు ఇవిగో..

**సాయంత్రం వేళ కెఫీన్‌కు దూరం**

మగతను వదిలించుకోవటానికో, ఉత్సాహంగా ఉండటానికో చాలామంది కాఫీ, టీ తాగేస్తూనే ఉంటారు. కానీ, వీటిల్లోని కెఫీన్ నిద్ర మీద ప్రభావం చూపుతుందనే విషయం మీకు తెలుసా? అడినోసిన్ అనే రసాయనాన్ని అడ్డుకోవటం ద్వారా కెఫీన్ అప్రమత్తంగా ఉండేలా చూస్తుంది. అసలు విషయం ఏంటంటే పగటిపూట ఒంట్లో పేరుకుపోయే అడినోసిన్ రాత్రిపూట నిద్ర వచ్చేలా చేస్తుంది. కెఫీన్ దీన్ని అడ్డుకోవటం వల్ల రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కెఫీన్ ప్రభావం సుమారు ఆరు గంటల వరకూ ఉంటుంది. అంటే సాయంత్రం 5 గంటలకు కాఫీ, టీ తాగితే దాని ప్రభావం రాత్రి 11 గంటల వరకు ఉంటుందన్నమాట. ఇది రాత్రి నిద్ర తగ్గేలా చేస్తుంది. పడుకోవటానికి ఆరు గంటల ముందు 400 మి.గ్రా. కెఫీన్ తీసుకున్నవారిలో మొత్తంగా గంట నిద్ర తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

కాబట్టి నిద్ర పట్టక సతమతమయ్యేవారు సాయంత్రం వేళల్లో కెఫీన్‌తో కూడిన టీ, కాఫీ, కూల్‌డ్రింకుల వంటివి తాగకపోవటం మంచిది.

**ట్రిప్టోఫాన్ వరం**

కంటి నిండా నిద్ర పట్టటానికి ట్రిప్టోఫాన్ బాగా ఉపయోగపడుతుంది. ఇదొక అమైనో ఆమ్లం. ఆహారం నుంచి లభించే ఇది మెదడులో సెరటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఈ రసాయనాలు నిద్రలో కీలక పాత్ర పోషిస్తాయి. త్వరగా నిద్ర పట్టడానికే కాకుండా రాత్రంతా గాఢంగా నిద్రపోవటానికీ మెలటోనిన్ తోడ్పడుతుంది. మనకు ఆనందం, సంతోషం కలగటానికి దోహదం చేసే సెరటోనిన్ నిద్ర-మెలకువల తీరునూ నియంత్రిస్తుంది.

అరటిపండు, బాదం, జీడిపప్పు, పిస్తా, బార్లీ, దంపుడు బియ్యం, చియా గింజలు, పప్పులు, గుమ్మడి విత్తనాలు, సాల్మన్ చేపలు, టోఫు, అక్రోట్లు, పాలు, పెరుగు, గుడ్డు తెల్లసొన వంటి వాటి నుంచి ట్రిప్టోఫాన్ దండిగా లభిస్తుంది. అలాగని ఇవి వెంటనే నిద్ర ముంచుకొచ్చేలా చేస్తాయని కాదు. వీటిని ఆహారంలో ఒక భాగం చేసుకుంటే క్రమంగా మంచి ఫలితం కనిపిస్తుందన్న మాట.

**పండ్లు, కూరగాయల మేలు**

నిద్ర బాగా పట్టేలా చూసుకునే మార్గాల్లో ఒకటి పండ్లు, కూరగాయలు మరింత ఎక్కువగా తినటం. వీటిల్లో సెరటోనిన్, మెలటోనిన్‌తో పాటు మెగ్నీషియం, విటమిన్ బి6, ఫోలేట్ వంటి సూక్ష్మ పోషకాలూ దండిగా ఉంటాయి. ఇవన్నీ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడేవే. వీటితో పీచు కూడా దండిగా లభిస్తుంది. అధిక పీచుతో కూడిన ఆహారం తీసుకునేవారు మరింత గాఢంగా నిద్ర పోతున్నట్టూ పరిశోధనలు చెబుతున్నాయి. బాగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకున్న స్త్రీలు నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. అందువల్ల ఆహార ఉత్పత్తులు, తీపి పదార్థాలు, పానీయాలకు బదులు ఇలాంటి సహజ పదార్థాలు తీసుకోవటం మంచిది.

అరటిపండ్లు, చెర్రీ, అనాస, పాలకూర, టమోటాల్లో పీచు, సంక్లిష్ట పిండి పదార్థాలు, సెరటోనిన్, మెలటోనిన్, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటివి దండిగా ఉంటాయి.

**నిద్రకు ముందు మద్యం వద్దు**

కొంతమంది రాత్రిపూట మద్యం తాగితే మంచి నిద్ర పడుతుందని భావిస్తుంటారు. కానీ, దీంతో ముంచుకొచ్చే మత్తు తాత్కాలికమే. మద్యం మొదట్లో మత్తును కలిగించినా ఆ తర్వాత నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. మధ్యలో మెలకువ వచ్చేలా చేస్తుంది. ఇలా గాఢ నిద్రకు భంగం కలిగిస్తుంది.

ఒకవేళ అంతగా అలవాటుంటే పడుకోవటానికి ముందు తాగకుండా చూసుకోవాలి. పడుకునే వేళకు శరీరంలోంచి దీని ప్రభావం తొలగిపోయేంత సమయం ఇవ్వాలి. మద్యంతో నిద్ర దెబ్బతింటున్నట్టు ఇప్పటికే గమనిస్తే మోతాదును తగ్గించుకోవటానికైనా ప్రయత్నించాలి. అంటే మద్యం అలవాటును మొత్తంగా మానెయ్యటం సాధ్యం కాకపోతే తాగే సమయం, మోతాదులనైనా మార్చుకోవటం మంచిదన్నమాట.

**కడుపు కాస్త ఖాళీగా..**

పడుకునే ముందు కడుపు నిండా తింటే నిద్రకు భంగం కలిగే అవకాశముంది. రాత్రిపూట జీర్ణక్రియ మందగిస్తుంది మరి. పడుకునేముందు ఎక్కువగా తింటే సరిగా జీర్ణం కాదు. తిన్న తర్వాత వెల్లకిలా పడుకోవటం మూలంగా ఛాతీలో మంట, గొంతులోకి ఆమ్లం ఎగదన్నుకు రావటం వంటి సమస్యలూ తలెత్తుతాయి. ఇవీ నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.

కాబట్టి రాత్రిపూట కడుపు కాస్త ఖాళీగా ఉంచుకోవటం మంచిది. అలాగే తిన్న వెంటనే పడుకోకుండా చూసుకోవాలి. రెండు, మూడు గంటలైనా వ్యవధి ఇవ్వాలి. కాస్త అటూఇటూ తిరగాలి. వీలైనంత వరకూ రాత్రి 8 గంటలలోపు భోజనం చేస్తే మంచిది. తిన్నది కాస్త జీర్ణం అయ్యాక పడుకుంటే నిద్ర బాగా పడుతుంది.

## భారత్‌తో సిరీస్ ఆడాలని చూస్తుంటే.. ఈ ఆఫ్ఘన్ జట్టు వచ్చి చెడగొట్టింది.. ఇబ్బందుల్లో బంగ్లాదేశ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంతో ఆగిపోయిన క్రికెట్ సిరీస్‌ను (3 వన్డేలు, 3 టీ20లు) మళ్లీ మొదలు పెట్టాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు గట్టిగానే ప్రయత్నిస్తోంది. గతంలో ఇరు దేశాల మధ్య వచ్చిన కొన్ని గొడవలు, భద్రతా సమస్యల వల్ల ఈ మ్యాచ్‌లు ఆగిపోయాయి. బంగ్లాదేశ్‌లో కొత్తగా వచ్చిన ప్రధాన మంత్రి తారిక్ రెహ్మాన్ ప్రభుత్వం భారత్‌తో మళ్లీ మంచి సంబంధాలు పెంచుకోవాలని ఎదురు చూస్తోంది.

**విదేశాంగ మంత్రుల స్థాయిలో చర్చలు:**

ఆటల ద్వారా భారత్‌తో ఉన్న సమస్యలను తొలగించుకోవాలని బంగ్లాదేశ్ చూస్తోంది. ఈ వ్యవహారంపై బంగ్లాదేశ్ క్రీడా మంత్రి అమినుల్ హక్ మాట్లాడుతూ.. ప్రధాని తారిక్ రెహ్మాన్ ఇప్పటికే భారత హైకమిషన్‌తో చర్చలు జరిపారని వెల్లడించారు. ప్రపంచకప్ చుట్టూ ఏర్పడిన డెడ్‌లాక్‌ను త్వరగా పరిష్కరించాలని మేము కోరుకుంటున్నాం.. క్రీడల ద్వారా పొరుగుదేశమైన భారత్‌తో మళ్లీ స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడమే తమ ప్రధాన మా లక్ష్యం అన్నారు. విదేశాంగ మంత్రుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

**బంగ్లా పర్యటనకు భారత్ నాట్ ఇంట్రెస్ట్:**

బంగ్లాదేశ్ ఎంతగా ప్రయత్నించినప్పటికీ, ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ మధ్యలో ఈ సిరీస్ జరగడం కష్టమేనని తెలుస్తోంది. ఎందుకంటే, ఇదే సమయంలో (సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో) ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు బీసీసీఐ ఇప్పటికే అంగీకారం తెలిపింది. ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) కూడా ఈ తేదీలను అధికారికంగా ఖరారు చేస్తూ వ్యాపార భాగస్వాములకు లేఖ రాసింది. దీంతో భారత్ బంగ్లాదేశ్ పర్యటన మరోసారి వాయిదా పడే అవకాశాలు క్లియర్ గా కనిపిస్తున్నాయి.

## కేకేఆర్ నుంచి రింకూ సింగ్ ఔట్?.. ఆ గుజరాత్ స్టార్‌ను తెచ్చుకోండి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయే ఐపీఎల్ సీజన్ ట్రేడ్ విండో సమయానికి ముందే ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల మార్పిడిపై ఆసక్తికరమైన వార్తలు మొదలయ్యాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఒక పెద్ద ట్రేడ్ జరిగే అవకాశం ఉందని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించారు. గుజరాత్ జట్టుకు మిడిల్ ఆర్డర్‌లో మ్యాచ్‌ను గెలిపించే రింకూ సింగ్ లాంటి హార్డ్ హిట్టర్ అవసరమని, అయితే రింకూను వదులుకోవడానికి కేకేఆర్ తేలికగా అంగీకరించదని అతడు చెప్పుకొచ్చాడు.

**సిరాజ్‌ను ఇస్తేనే రింకూను వదులుకుంటాం:**

తన యూట్యూబ్ ఛానెల్‌లో ఆకాశ్ చోప్రా (ఆకాశ్ చోప్రా జియోహాట్‌స్టార్) మాట్లాడుతూ.. ఈ రెండు జట్ల మధ్య ఆటగాళ్ల ఎక్స్ఛేంజ్ ఎలా ఉండవచ్చో వివరించారు. గుజరాత్ టైటాన్స్ జట్టు రింకూ సింగ్ లేదా రమణ్‌దీప్ సింగ్‌లను తమ వైపు తీసుకోవాలని భావిస్తే, కేకేఆర్ యాజమాన్యం దానికి ప్రతిఫలంగా టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్‌ను ఇవ్వాలని కోరుతుంది. అయితే గుజరాత్ కూడా సిరాజ్‌ను వదులుకోవడం సులభం కాదు. ఒకవేళ సిరాజ్ (సిరాజ్ ట్రేడ్ డీల్) డీల్ కుదరకపోతే యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌తో పాటు మరొక ఆటగాడిని కలిపి ఆఫర్ చేస్తేనే కేకేఆర్ నుంచి రింకూను తీసుకోవడం సాధ్యమవుతుందని చోప్రా విశ్లేషించారు.

**అహ్మదాబాద్ మైదానంలో రింకూ రికార్డు!**

గుజరాత్ టైటాన్స్ జట్టులోకి రింకూ సింగ్ వస్తే చాలా ప్రయోజనకరంగా ఉంటుందని ఆకాశ్ చోప్రా పేర్కొన్నారు. గుజరాత్ హోమ్ గ్రౌండ్ అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలోనే రింకూ సింగ్ గతంలో ఒకే ఓవర్‌లో ఐదు సిక్సర్లు కొట్టి చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఆ సెంటిమెంట్ ప్రకారం అహ్మదాబాద్ పిచ్ రింకూకు బాగా సరిపోతుందని, కానీ ఒక మంచి భారత ఫాస్ట్ బౌలర్‌ను పొందే వరకు కేకేఆర్ తమ స్టార్ ఫినిషర్‌ను అంత తేలికగా వదులుకోదని చోప్రా స్పష్టం చేశారు.

## కశ్మీర్ లోయలో మళ్లీ క్రికెట్ సందడి.. 40 ఏళ్ల తర్వాత ఇరానీ కప్!





**హైదరాబాద్ పెన్ పవర్:** అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు శ్రీనగర్‌లోని ప్రతిష్టాత్మక షేర్-ఎ-కాశ్మీర్ స్టేడియంలో ఇరానీ కప్ 2026 పోరు జరగనుంది. 2025--26 రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన జమ్మూ & కాశ్మీర్ జట్టు, రెస్ట్ ఆఫ్ ఇండియా టీమ్‌తో ఈ మ్యాచ్‌లో తలపడనుంది. 1986 సెప్టెంబర్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగిన వన్డే మ్యాచ్ తర్వాత, దాదాపు 40 ఏళ్లకు కాశ్మీర్ లోయలో జరుగుతున్న అత్యంత కీలకమైన క్రికెట్ టోర్నమెంట్ ఇదే కావడం విశేషం.

**రంజీ టైటిల్‌తో దక్కిన ఆతిథ్య హక్కులు:**

హుబ్లీ వేదికగా జరిగిన 2025--26 రంజీ ట్రోఫీ ఫైనల్లో కర్ణాటకపై తొలి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యంతో అద్భుత విజయం సాధించి జమ్మూ కాశ్మీర్ తమ మొదటి రంజీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆ చారిత్రాత్మక విజయంతోనే ఈసారి ఇరానీ కప్‌లో ఆడే అర్హత సాధించడమే కాకుండా, కాశ్మీర్ గడ్డపై ఆతిథ్యం ఇచ్చే అరుదైన అవకాశాన్ని కూడా సొంతం చేసుకుంది.

**స్టార్ పేసర్ ఆకిబ్ నబీపైనే అందరి దృష్టి:**

ఈ మ్యాచ్‌లో జమ్మూ కాశ్మీర్ బౌలింగ్ విభాగాన్ని బారాముల్లాకు చెందిన 29 ఏళ్ల స్టార్ పేసర్ ఆకిబ్ నబీ దార్ ముందుండి నడిపించనున్నాడు. గత రంజీ సీజన్‌లో ఏకంగా 60 వికెట్లు తీసి జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిన ఆకిబ్, కర్ణాటకతో జరిగిన ఫైనల్లో 5/54 తో చెలరేగాడు. ఇటీవల భారత టెస్టు జట్టులోకి కూడా ఎంపికైన ఆయన, రాజస్థాన్ రాయల్స్ స్టార్ యుధ్‌వీర్ సింగ్ చరక్‌తో కలిసి ప్రత్యర్థి బ్యాటర్లకు సవాలు విసరనున్నాడు.

**రెస్ట్ ఆఫ్ ఇండియా సవాల్:**


ఇరానీ కప్‌లో అత్యధికంగా 30 సార్లు విజేతగా నిలిచిన అద్భుత రికార్డు రెస్ట్ ఆఫ్ ఇండియా సొంతం. బీసీసీఐ త్వరలోనే ఈ జట్టును ప్రకటించనుండగా, ఏ ఆటగాళ్లతో వచ్చినా జేఅండ్‌కేకి గట్టి పోటీ తప్పదు. ఇక ఇరానీ కప్ ముగిసిన వెంటనే అక్టోబర్ 11వ తేదీ నుంచి జమ్మూ కాశ్మీర్ తమ రంజీ ట్రోఫీ 2026--27 టైటిల్ డిఫెన్స్‌ను మధ్యప్రదేశ్‌తో మ్యాచ్ ద్వారా ప్రారంభించనుంది.

## 'మిర్జాపూర్ ది మూవీ'.. థియేటర్లలో గ్యాంగ్‌స్టర్ డ్రామా రీసౌండ్



శృతి హాసన్ సహజమైన గ్లామర్ అందరి దృష్టిని ఆకర్షించింది

ఓటీటీలో గొప్ప ఆదరణ పొందిన సిరీస్ ని థియేటర్లలో విడుదల చేయాలనే ఆలోచన సరైనదేనా? అంటే గతానుభవాలకు భిన్నంగా మిర్జాపూర్ గ్యాంగ్ స్టర్ డ్రామా విజయం సాధిస్తుందని అభిమానులు భావిస్తున్నారు. నిజానికి మిర్జాపూర్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న -మిర్జాపూర్ ది మూవీ- ట్రైలర్ విడుదలవుతూనే సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఓటీటీ వేదికగా దేశవ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందిన ఈ సిరీస్ ఇప్పుడు మరింత వైలెంట్‌గా వెండితెరపైకి వస్తోంది. మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే అదే రక్తసిక్తం, పాత పాత్రలతో పాటు కొత్త శక్తుల రాకతో ఈసారి వెండితెరపై మరింత భారీగా స్ట్రైక్ అయ్యేలా కనిపిస్తోందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి నటించిన కాలీన్ భయ్యా తన శాంత స్వభావాన్ని కాపాడుకుంటూనే.. అవసరమైనప్పుడు ఎంత క్రూరంగా మారగలడో మరోసారి చూపించబోతున్నారు. ఇక అభిమానుల అభిమాన పాత్ర మున్నా భయ్యా (దివ్యేందు) అదే మాస్ ఎనర్జీతో.. తన ముందర ఎవరైనా ఎదిరిస్తే బూతులతో విరుచుకుపడే వైఖరితో రీ-ఎంట్రీ ఇచ్చాడు. ట్రైలర్‌లో రాజకీయనాయకుడితో సాగే సన్నివేశం మున్నా మార్క్ క్యారెక్టరైజేషన్‌కు అద్దం పడుతోంది. వీరితో పాటు గుడ్డు, బాబ్లూల ప్రయాణం మొదటి నుండి సరికొత్తగా ఆవిష్కరించబడబోతోంది. అంతేకాకుండా, గొంతులు కోసే కంపౌండర్ పాత్ర కూడా ఈసారి మళ్లీ థియేటర్లలో రచ్చ చేయనుంది. అయితే ఈ ట్రైలర్‌లో అందరి దృష్టినీ ఆకర్షించి ప్రత్యేకంగా నిలిచింది మాత్రం రవికిషన్ పాత్రే! ఈ బలమైన గ్యాంగ్‌స్టర్ డ్రామాకు రవికిషన్ చేరిక ఒక ప్రధాన బలంగా మారింది. స్క్రీన్‌పై విలనిజంతో భయపెడుతూనే.. తన నవ్వు పూయించే డైలాగ్ టైమింగ్‌తో ప్రేక్షకులను మెప్పించడానికి ఆయన సిద్ధమయ్యారు. సిరీస్‌లోని హింస, రా రకమైన కంటెంట్‌ను సినిమాల్లో ఎక్కడా తగ్గించకుండా మేకర్స్ అలాగే కొనసాగించడంతో షో ప్రియులకు బిగ్ స్క్రీన్‌పై సంపూర్ణ వినోదం లభించడం ఖాయంగా కనిపిస్తోంది.భారీ తారలు లేకపోవడంతో ఈ చిత్రాన్ని పరిమిత బడ్జెట్‌తోనే రూపొందించినప్పటికీ, సిరీస్‌కు ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే గతంలో ఓటీటీ సిరీస్‌లు సినిమాలుగా మారినప్పుడు బాక్సాఫీస్ వద్ద ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ అడాప్టేషన్ ఎంతవరకు హిట్ కొడుతుందనే దానిపై విశ్లేషకులు జాగ్రత్తగా అంచనాలు వేస్తున్నారు. ఏది ఏమైనా సెప్టెంబర్ 4న థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలి.




**ఫ్యాన్స్ రెస్పాన్స్ ఇలా ఉంది: సోషల్ మీడియాలో హంగామా!**

'మిర్జాపూర్ ది మూవీ' అఫీషియల్ హిందీ ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలైన క్షణం నుంచే రికార్డు స్థాయి వ్యూస్, కామెంట్లతో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా 'మున్నా భయ్యా' (దివ్యేందు) పునరాగమనం పై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన కమ్‌బ్యాక్ కోసమే ఈ సినిమా తీసినట్లుందని కామెంట్స్ చేస్తున్నారు. అలాగే -దేఖ్ రహా హై బినోద్.. సచివ్ జీ ఎలా గుండాగిరీ లైన్‌లోకి వచ్చారో!- అంటూ -పంచాయత్- సిరీస్ రిఫరెన్స్‌లతో మీమర్స్ చేస్తున్న కామెంట్లు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.ఈ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రవికిషన్ పాత్రపై కూడా వీక్షకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ భయాన్ని గొలుపుతూనే వినోదాన్ని అందిస్తుందని, 'పార్ట్ టైమ్ పొలిటీషియన్ - ఫుల్ టైమ్ యాక్టర్' అని నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. పంకజ్ త్రిపాఠి-కాలీన్ భయ్యా- గాంభీర్యం, మున్నా భయ్యా మాస్ ఎనర్జీ, రవికిషన్ నటన మేళవింపుతో వచ్చిన ఈ ట్రైలర్ దూసుకెళుతోంది.



వెండి అలంకరణలతో కూడిన దుస్తుల్లో శర్వరీ మెరుపులు - ఆకర్షణీయమైన హుందాతనంతో అలరించిన వైనం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965